RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 13 శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

## మేకిన్ ఇండియా విఫలం..మోదీ గుర్తించాలి

పట్నా : జీడీపీలో తయారీ రంగం వాటా 2104లో 15.3 శాతంగా ఉంటే ఇప్పుడది 12.6శాతానికి పడిపోయిందని.. ఇది గత 60ఏళ్లలో అత్యంత కనిష్ఠం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పేర్కొన్నారు. లోక్ సభలో మోదీ తన ప్రసంగంలో ఎక్కడా 'మేకిన్ ఇండియా' గురించి మాట్లాడలేదని.. ఈ 'మేక్ ఇన్ ఇండియా' మంచి కార్యక్రమమే అయినా అది విఫలమైందనే విషయాన్ని ప్రధాని గుర్తించాలని అన్నారు. దళితనేత, స్వాతంత్ర్య సమరయోధుడు జగ్‌లాల్ చౌదరీ జయంతి సందర్భంగా పట్నాలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోదీ మాట్లాడితే.. ఎన్నికల్లో అణగారిన వర్గాలకు టికెట్లు ఇవ్వడం ద్వారా వారికి ప్రాతినిధ్యం కల్పించామని గొప్పగా చెబుతుంటారని.. అయితే ఆ వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి అన్ని అధికారాలనూ ఆయన లాగేసుకున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కూడా పేరుకే ఉన్నారని.. ఆర్‌ఎస్ఎస్ సిఫారసు చేసిన ఓఎస్డీలే శాఖలపై పెత్తనం చెలాయిస్తున్నారని మండిపడ్డారు.

# ప్రజల్లోకి ప్రభుత్వం..

## 'స్థానికం'పై సీఎం రేవంత్ ప్లాన్!



## ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్ళాలి

### మంత్రులు, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : 'ప్రజల్లోకి ప్రభుత్వం' నినాదంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు..ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొనేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాజాగా జరిగిన సీఎల్పీ సమావేశంలో పలు విషయంపై చర్చించారు. త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపైనా దృష్టి పెట్టారు. స్థానిక సంస్థల్లో దాదాపు క్లీన్ స్వీప్ చేసే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు. దీనికిగాను ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపించాలని నిర్ణయించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించడం ద్వారా ప్రజలను పార్టీవైపు మళ్లించుకోవాలని ఈ సందర్భంగా సీఎం దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కుల గణన, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలను కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని.. ఈ క్రమంలో కొంత కష్టమైనా.. గడప గడప తిరిగి ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే.. ఫలితం వస్తుందని.. కేవలం ఎవరో ఒకరిద్దరు కష్టపడతరులే.. మనం కూర్చుంటమంటే.. ప్రయోజనం లేదని సీఎం రేవంత్ ఈసందర్భంగా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ప్రతి ఒక్కరూ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యధిక గ్రామాలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఎమ్మెల్యేలదేన స్పష్టం చేశారు. గ్రామాల్లో హామీల అమలుకు ముందడుగు వేయాలని, సీసీరోడ్లు, ఆలయాలు, నిర్మాణ అనుమతులకు, నిధుల మంజూరు కోసం మంత్రులను కలవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల పదవులను కేటాయించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీలో కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**వేటు తప్పదు!...** సీఎల్పీ భేటీలో పార్టీ కట్టు తప్పుతున్న ఒకరిద్దరు నాయకులపై వాడి వేడిగా చర్చ సాగింది. పార్టీని, ప్రభుత్వాన్ని కూడా ఇరుకున పెడుతున్న ఇలాంటి వారిని ఉపేక్షించరాదని.. కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌కు సభ్యులు సూచించారు. అయితే.. ఆ విషయాన్ని తనకు వదిలేయాలని.. అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి.. చర్యలు తీసుకుంటామని రేవంత్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది.




సర్కార్ తెలంగాణకి కూడా శుభవార్త అందించింది. త్వరలోనే తెలంగాణకు 176.5 కోట్లు రానున్నాయి. జాతీయ రోడ్డు రవాణా శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి సహాయం 2024–2025 పథకం" నిర్వహణలో కీలకమైన మైలెస్టోన్స్ సాధించినందుకు, తెలంగాణ రాష్ట్రానికి అదనపు ప్రోత్సాహక సహాయం అందించనుంది కేంద్ర సర్కార్. తెలంగాణ రాష్ట్రం మైల్ స్టోన్ 1 మరియు మైల్ స్టోన్ 2 పథకాలలో రూ:125 కోట్లు మరియు రూ 51.5 కోట్లు అర్హత సాధించిందని ప్రకటనలో తెలియజేశారు. ఇక తెలంగాణ రాష్ట్రం మోటార్ వెహికల్ టాక్స్ కన్సెషన్ ఇచ్చినందుకు అర్హత రూ.50 కోట్లు అని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం మైల్స్టోన్ 1 మరియు మైల్స్టోన్ 2 పథకాలలో 125 కోట్లు, 51.5 కోట్లు అర్హత సాధించిందని ప్రకటన విడుదల అయింది. తెలంగాణ రాష్ట్రం మోటార్ వెహికల్ టాక్స్ కన్సెషన్ ఇచ్చినందుకు అర్హత 50 కోట్లు గా ఉంది. మైల్ స్టోన్ 2 లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం 15 ఏండ్లు పైబడి ఉన్న రవాణా వాహనాలు తొలగించడానికి స్క్రాప్ చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రణాళిక ను పంపినది. ఈ పథకం కింద 75 కోట్లు అర్హత సాధించింది. తెలంగాణ రాష్ట్రం మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రయారిటీగా తీసుకున్నందుకు 31.5 కోట్లు అర్హత సాధించింది, 20 కోట్లు ప్రాధాన్యత లేని జిల్లాల కోసం. మొత్తం 50.5 కోట్లు ప్రోత్సాహకం అందిస్తుంది. దీంతో తెలంగాణకు ఊరట లభించినట్టు అయింది.

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో కేటీఆర్ బృందం భేటీ.. రోడ్ల అభివృద్ధి కోసం విజ్ఞప్తి!

సూర్యాపేట నుండి సిరిసిల్ల వరకు జాతీయ రహదారి 368బీని నిర్మిస్తున్నారు. ఈ ప్రపోజల్‌ను వేములవాడ నుండి కోరుట్ల వరకు విస్తరించాలని.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. విస్తరణ వల్ల ఈ రహదారి వెంబడి ఉన్న తెలంగాణలోని ప్రముఖ దేవాలయాలు వేములవాడ, కొండగట్టు, ధర్మపురి మరింత అనుసంధానమవుతాయని వివరించారు. అలాగే, నేషనల్ హైవే 63కి అనుసంధానం వీలు అవుతుందని చెప్పారు.

**గడ్కరీకి వినతి..** దీనికి సంబంధించి గతంలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదనలు పంపారని కేటీఆర్ కేంద్రమంత్రికి వివరించారు. మానేరు నదిపై రోడ్ కమ్ రైల్ బ్రిడ్జి నిర్మించాలని గడ్కరీని కోరారు. ఈ ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. కేటీఆర్ తోపాటు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, సురేష్ రెడ్డి, దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి నితిన్ గడ్కరీని కలిసిన వారిలో ఉన్నారు.

**కేసీఆర్ హయాంలో..** 2017లోనే సూర్యాపేట నుంచి సిరిసిల్ల వరకు హైవే నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు.

జనగామ, సిద్దిపేట మీదుగా సిరిసిల్ల నుంచి కామారెడ్డి జాతీయ రహదారిని కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. విజయవాడ, కామారెడ్డి జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తే.. భవిష్యత్తులో సిద్దిపేట, సిరిసిల్ల ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని అప్పటి సీఎం కేసీఆర్ భావించారు.



**2022లోనే ప్రారంభం..** ఈ రహదారి నిర్మాణంలో భాగంగా.. జనగామ – దుద్దెడ రోడ్డు విస్తరణ పనులను 2022 లోనే ప్రారంభించారు. జనగామ నుంచి దుద్దెడ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి రోడ్డు విస్తరణ కోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.438 కోట్లు నిధులను మంజూరు చేసింది. రోడ్డు విస్తరణకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్అండ్‌సీ కంపెనీ ఈపీసీ (ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో రూ.423 కోట్లతో టెండర్‌ను దక్కించుకున్నది.

**అవాంతరాలు లేకుండా..** 365బీ నేషనల్ హైవే చేర్యాల మీదుగా వచ్చి దుద్దెడ వద్ద రాజీవ్ రహదారితో కనెక్ట్ అవుతుంది. దుద్దెడ నుంచి సిద్దిపేట వరకు ఆ రోడ్డులోనే భాగంగా కొనసాగనుంది. దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిని క్రాస్ చేసి సిద్దిపేట కలెక్టరేట్ ఆఫీసు వెనుక నుంచి కోమటి చెరువు సమీపంగా.. సిద్దిపేటకు చేరుతుంది. జక్కాపురం, రామచంద్రాపూర్, నేరెళ్ల, సారంపల్లి, తంగళ్లపల్లి గ్రామాల వద్ద బైపాస్‌లతో రోడ్డు నిర్మించనున్నారు. సిరిసిల్ల పట్టణం వద్ద మానేరు నది మీదుగా వంతెన నిర్మిస్తారు. మధ్యలో కొన్ని చిన్న వంతెనలు కూడా నిర్మించనున్నారు. ఈ రహదారులు అందుబాటులోకి వస్తే ఎటువంటి అవాంతరాలు లేకుండా దూసుకెళ్లిపోవచ్చు.

**తెలంగాణపై స్పెషల్ ఫోకస్..** తెలంగాణలో కొత్త రహదారుల నిర్మాణం, రోడ్ల విస్తరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం సహా.. హైదరాబాద్– విజయవాడ విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రీజినల్ రింగు రోడ్డును రెండు భాగాలుగా 350 కి.మీ మేర నిర్మిస్తుండగా.. హైదరాబాద్– విజయవాడ హైవేను నాలుగు వరసల నుంచి 6 వరసలకు విస్తరించనున్నారు.




## సిరిసిల్లకు బైపోల్..?

### సీఎం రేవంత్ మాటల్లో అర్థమేంటి..?

తెలంగాణలో ఉప ఎన్నికలు తప్పవా.? బైపోల్స్ వస్తే మూడు స్థానాలకేనా.? లేదంటే మొత్తం పది నియోజకవర్గాలకా.? ఇప్పుడిదే రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న అంశం. ఓ వైపు సుప్రీంకోర్టులో విచారణ, మరోవైపు ఎమ్మెల్యేలకు నోటీసులు..జంపింగ్ ఎమ్మెల్యేల మీటింగ్..ఈ డెవలప్‌మెంట్ చూస్తుంటే ఉపఎన్నికలు రావొచ్చన్న అంచనాలు బలపడుతున్నాయి.

**కేటీఆర్ మాటలకు సీఎం రేవంత్ కౌంటర్ :** బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ అయితే బైపోల్స్ రావడం పక్కా సిద్ధంగా ఉండాలని క్యాడర్‌కు పిలుపునిస్తున్నారు. కేటీఆర్ మాటలకు కౌంటర్‌గా సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు ఆసక్తిరేపుతున్నాయి. సిరిసిల్లకు కూడా బైపోల్ తప్పదంటున్నారు సీఎం రేవంత్. ఆయన చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు రకరకాల చర్చకు దారి తీస్తోంది. కేటీఆర్‌పై అటాక్ చేసే క్రమంలో రొటీన్‌గానే రేవంత్ ఈ కామెంట్స్ చేశారా లేక ఆయనపై ఉన్న కేసులను దృష్టిలో పెట్టుకుని అలా మాట్లాడారా అన్నదే హాట్ టాపిక్‌గా మారింది. ఉపఎన్నికలు వస్తాయని వారం రోజులుగా తెలంగాణలో హాట్ హాట్ చర్చ జరుగుతోంది. జంపింగ్ ఎమ్మెల్యేలకు కూడా ఇదే గుబులు పట్టుకుంది. కాంగ్రెస్‌లోనూ టెన్షన్ కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై..ఆరు నెలలుగా న్యాయపోరాటం చేస్తోంది కారు పార్టీ.

**ఆ పది నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు ఖాయం :** సుప్రీం సూచనతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించిన విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది సుప్రీంకోర్టు. దీంతో కచ్చితంగా సుప్రీంకోర్టులో తమకు న్యాయం జరుగుతుందని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పడుతుందని, ఆ పది నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ పది ఎమ్మెల్యేల్లో ముందుగా.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌లపై కోర్టును ఆశ్రయించింది బీఆర్ఎస్. ఇప్పుడీ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ నెల 10న కేసుకు విచారణ జరగనుండగా ఈ ముగ్గురిపై వేటు పడుతుందా..లేదంటే స్పీకర్ మరో ఏడు మంది ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇచ్చారు కాబట్టి..మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై వేటు పడుతుందా అన్నదే ఉత్కంఠగా మారింది. సుప్రీంకోర్టు గనుక ఫిరాయింపులపై తేల్చేస్తే పది నియోజకవర్గాలకు ఉపఎన్నికలు రావడం పక్కా అన్న చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు విచారణ, వారికి స్పీకర్ నోటీసులపై సీఎం రేవంత్ రెడ్డి తనదైన స్టైల్‌లో స్పందించారు. నిబంధనల ప్రకారమే పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారని, అందుకు వారు సమాధానం ఇస్తారని చెప్పారు.

**సిరిసిల్లకు బైపోల్ ఎలా వస్తుంది? :** పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు వస్తాయన్న కేటీఆర్ వ్యాఖ్యలపైనా ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఆ పది నియోజకవర్గాలకు బైఎలక్షన్ వస్తే సిరిసిల్ల నియోజకవర్గానికి కూడా ఉపఎన్నిక వస్తుందని అన్నారు రేవంత్ రెడ్డి. ఇప్పుడీ అంశమే రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సిరిసిల్లకు బైపోల్ ఎలా వస్తుంది అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రొటీన్‌గానే ఈ కామెంట్స్ చేశారా లేక మరేదైనా కారణముందా అన్నదే ఇంట్రెస్టింగ్‌గా మారింది. కేటీఆర్‌పై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ, ఈడీ కేసులను ఎదుర్కొంటున్న కేటీఆర్..స్వయంగా విచారణకు హాజరయ్యారు. కోర్టులో పిటీషన్ కూడా వేశారు. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొలిక్కి వస్తుండగా ఆ ఇష్యూలో కూడా కేటీఆర్‌పై అలిగేషన్స్ ఉన్నాయి. దీంతో ఈ కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేటీఆర్ తప్పకుండా జైలుకు వెళ్లక తప్పదని రేవంత్ రెడ్డి అంటున్నారట.

**సిరిసిల్ల ఉపఎన్నికపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ :** అలా నేరం రుజువై.. ఎమ్మెల్యేకు కనీసం రెండుళ్లకుపైగా జైలు శిక్ష పడితే శాసనసభ సభ్యత్వం రద్దవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లకు ఉపఎన్నిక వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేసి ఉంటారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి కేటీఆర్‌పై నమోదైన కేసులు, ఆరోపణలు బైపోల్‌కు దాకా దారి తీస్తాయా..లేక పొలిటికల్ గేమ్‌లో భాగంగానే రేవంత్ అలా మాట్లాడారా అన్నది ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. ఈనెల పదిన సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బైపోల్ రాజకీయం ఇంకెంత దూరం వెళ్లనుందో ఇంకోంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## తాను మునిగి.. కేజ్రీని ముంచుతున్న కాంగ్రెస్!

తాను మునగడమే కాకుండా.. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వం లోని ఆమ్ ఆద్మీ పార్టీని కూడా కాంగ్రెస్ పార్టీ ముంచేస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత.. పలు చానెళు చర్చ చేపట్టా యి. దీనిలో జాతీయ స్థాయి విశ్లేషకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ గెలుస్తుందని ఒక్క కేకే సర్వే మాత్రమే చెప్పిన దరిమిలా.. ఆప్ ఓటమి..కి కారణాలు వెతికే పని ప్రారంభించారు. దీనిలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తెరమీదికి వచ్చింది. జాతీయ స్థాయిలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆప్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగింది. కానీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే సరికి మాత్రం ఆప్‌తో విభేదించింది. వాస్తవానికి కేజ్రీవాల్ 5-10 స్థానాలను ఇచ్చేందుకు ఆదిలో ముందుకు వచ్చారు. కానీ, కాంగ్రెస్ 25 స్థానాలకు పట్టుబట్టింది. దీంతో కేజ్రీవాల్ ఒంటరి పోరుకు రెడీ అయ్యారు. దీంతో బెట్టు పోయిన కాంగ్రెస్ తాము కూడా ఒంటరి పోరు చేస్తామనిప్రకటించి.. 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇది పెద్ద తప్పని అప్పట్లోనే విశ్లేషణలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ పావుకునేది ఏమీ లేదని.. ఉన్న ఓట్లను చీల్చడం ద్వారా బీజేపీకి మేలు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని.. పెద్ద ఎత్తున వ్యాసాలు, విశ్లేషణలు కూడా వచ్చాయి. అయినా.. కాంగ్రెస్ పార్టీ వెనక్కి తగ్గలేదు. పైగా.. బీజేపీని తాజా ఎన్నికల్లో పన్నెత్తు మాట అనకుండా.. అక్రమార్కుడు, అవినీతి పరుడు, అద్దాల బంగళా కట్టుకున్నాడంటూ.. రాహుల్ గాంధీ.. మాజీ సీఎం కేజ్రీవాల్ పైనే విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారం ఢిల్లీ ప్రజలకు చిర్రెత్తుకొచ్చేలా చేసింది. ఈ పరిణామాలను బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుని.. కాంగ్రెస్‌ను పన్నెత్తుమాట అనుకుండా.. కేజ్రీవాల్‌పైనే విమర్శల బాణాలు వేసింది. ఫలితంగా.. ప్రజలకు కేజ్రీవాల్ విలన్ అయ్యారన్నది విశ్లేషకుల అంచనా. పోనీ.. ఈ పరంపరలో కాంగ్రెస్‌ను హత్తుకున్నారా? అంటే.. అసలు కాంగ్రెస్‌లో బలమైన నాయకత్వం లేకపోవడం.. సీఎం అభ్యర్థి ని కూడా ప్రకటించకపోవడంతో ప్రజలు ఆ పార్టీవైపు మొగ్గు చూపలేదు. మొత్తంగా.. కాంగ్రెస్ వ్యహరించిన తీరు బీజేపీకి మేలు చేసే పరిస్థితిని తీసుకువచ్చిందని అంటున్నారు. క్లియర్ కట్గా బీజేపీ ఎగ్జిట్ పోల్స్‌లో ఇంత మెజారిటీ దక్కించుకునేందుకు కాంగ్రెస్, ఆప్‌లపై ప్రజలకు ఏర్పడిన అసహనమేనని పేర్కొన్నారు. తాను మునిగి.. తన జాతీయ మిత్రపక్షం ఆప్‌ను కూడా ముంచేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అంటున్నారు. ఈ పరిణామాలు ఎలా ఉన్నా.. బీజేపీ మాత్రం గెలుపు అంచుల వరకు చేరుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలన్నీ.. దాదాపు బీజేపీ పట్టం కట్టగా.. కాంగ్రెస్ కేవలం 1 అరా స్థానాలకే పరిమితం కానుందన్న లెక్కలు హస్తం నేతలకు ఇబ్బందిగా మారాయి.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రూరల్ బీజేపీ నూతన అధ్యక్షున్ని సన్మానించిన నాయకులు



శామీర్ పేట, (గరుడ వార్త) : బీజేపీ పార్టీ నూతన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రూరల్ అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాసు నియమితులవ్వడంతో ఆ పార్టీ నాయకులు ఘనంగా గురువారం సన్మానించారు. మూడు చింతలపల్లి మండలం సంపన్ బోల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బుద్ధి శ్రీనివాసను పార్టీ అధిష్టానం ఇటీవల జిల్లా రూరల్ నూతన అధ్యక్షునిగా నియమించింది. ఇందులో భాగంగా కీసర మండలానికి చెందిన బీజేపీ నాయకుడు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు శామీర్ పేట మండలం తూంకుంటలోని పార్టీ కార్యాలయంలో జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకం, విశ్వాం తో అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకుగాను పార్టీ అధిష్టానాకి, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను నిరంతరంపార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటు పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు

## భూసార అనుగుణంగా పంటలు వేస్తే రైతుకు అధిక దిగుబడి రాబడి : వ్యవసాయ శాస్త్రవేత్తలు

### భూసార పరీక్షల కార్డుల పంపిణీని చేస్తున్న అధికారులు






శామీర్ పేట, (గరుడ వార్త) : భూసారనుగుణంగానే రైతు పంటలు పండిస్తే అధిక దిగుబడి రాబడి ఉంటుందని ఇక్రిశాట్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పుష్పజీత్ సూచించారు. అందుకే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించాకే పంటలు వేసుకోవాలని అన్నారు . గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ లో ఇక్రిశాట్, లారస్ ల్యాబ్ ప్రాజెక్ట్ కింద వ్యవసాయ భూముల భూసార పరీక్షల కార్డుల పంపిణీని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో భూసార పరీక్షలు చేసిన అనంతరం భూమి సారాన్ని బట్టి పంటలు వేసుకోవాలన్నారు. దీంతో పంటల దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. నేల సమతుల్యత, పోషక స్థితి, సేంద్రియకర్బన పదార్థాల నిలువలను పెంపొందించడం వంటి కీలక పరిస్థితులపై చేపట్టవల్సిన పద్దతులను రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పంటల ఎంపిక, ఎరువుల వాడకం, పునర్పుత్తి వ్యవసాయ పద్ధతులపై రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇక్రిశాట్ ప్రతినిధులు సివి రంగనాథ్, మండల వ్యవసాయ విస్తీరణ అధికారి రవి, అధికారులు, సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీలకు చేయూతనిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే...

### అలియాబాద్ చౌరస్తాలో రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



శామీర్ పేట, (గరుడ వార్త) : ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ఇంత గొప్ప స్థాయిలో ఎస్సీల అభివృద్ధికి కృషి కృషి చేయలేదని అలా కృషి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేనని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో బీసీలకు రిజర్వేషన్లను ప్రకటించి ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నుంచి చేయూత అందిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీల వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతునివ్వడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీజీ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు

గోదావరిఖని : గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల(సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో రానున్న విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల నిర్వహణకు ఇటీవల దరఖాస్తు చేశారు. కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలల్లో కేవలం గోదావరిఖనిలోని వైద్య కళాశాల నిర్వాహకులు మాత్రమే పీజీ కోర్సుల కోసం దరఖాస్తు చేయడం గమనార్హం. జాతీయ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం నాలుగు విభాగాల్లో పీజీ కోర్సులు ప్రారంభించే అవకాశముండటంతో వాటికి మాత్రమే దరఖాస్తు చేశారు. పీజీ తరగతుల నిర్వహణతో పాటు పీజీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహ భవనం సిద్ధంగా ఉంది. అవసరమైన ఇతర సదుపాయాలు సైతం వైద్య కళాశాలలో అందుబాటులో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో జాతీయ వైద్య కమిషన్‌కు దరఖాస్తు చేశారు.

**నాలుగు విభాగాలు...**

జాతీయ వైద్య కమిషన్ నిబంధనల ప్రకారం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాలలో సదుపాయాలు, ఆసుపత్రిలో పడకల స్థాయి, ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్ల సంఖ్య పెరగడం తదితర కారణాలతో ఆయా విభాగాల్లో పీజీ కోర్సుల నిర్వహణకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో ప్రసూతి, ఎముకల శస్త్ర చికిత్స విభాగంలో అత్యధిక రద్దీ ఉండగా బయోకెమిస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల్లో ఒక్కో దానిలో నాలుగు సీట్ల చొప్పున పీజీ కోర్సులను మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్య విద్య సంచాలకులకు దరఖాస్తు చేయగా వారు ఆమోదం తెలపడంతో ఆయా విభాగాల్లో పీజీ కోర్సులను మంజూరు చేయాలంటూ జాతీయ వైద్య కమిషన్‌కు అవసరమైన దస్త్రాలను సమర్పించారు. ఒక్కో సీటుకు నిర్ణీత రుసుమును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండటంతో దానికి సంబంధించి కార్యాచరణ



పూర్తి కావాల్సి ఉంది.

**పెరగనున్న వైద్య సేవలు**

గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ కోర్సులు మంజూరయితే ఆసుపత్రిలోని ప్రజలకు సైతం మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో విభాగంలో నలుగురు పీజీ విద్యార్థులు రానుండగా ఆయా విభాగాల్లోని సీనియర్ వైద్యులు, ఆచార్యుల పర్యవేక్షణలో వారు వైద్య సేవలందించే అవకాశం ఉంటుంది. జాతీయ వైద్య కమిషన్ అనుమతులు లభిస్తే అదనంగా 16 మంది పీజీ విద్యార్థులు ఓ వైపున కళాశాలలో ఆయా విభాగాల్లో ప్రత్యేక విద్యను అభ్యసిస్తూనే సార్వజనిక ఆసుపత్రిలో వైద్య సేవలందించే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర వైద్య సేవలందించడంలో ఎమర్జెన్సీ మెడిసిన్ కోర్సు అత్యవసరంగా భావిస్తున్నారు. వ్యాధుల నిర్ధారణలో బయోకెమిస్ట్రీ విభాగం కీలకమే. ప్రసూతి, ఎముకల శస్త్ర చికిత్సల విభాగంలో నిరంతర రద్దీ ఉంటుంది. పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు రెండో సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో సేవలందిస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత మరో ఏడాది పాటు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించాలనే నిబంధన ఉండటంతో ఆయా విభాగాల్లో సేవలు మెరుగుపడే అవకాశముంది.

## ముంచుకొస్తున్న గడువు... పూర్తికాని పనులు

ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 10న ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి ఉత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. వారం రోజుల గడువే ఉండగా ఏర్పాట్లు వేగంగా సాగడం లేదు. ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఉదయత్ పూర్వమే స్వామి వారికి ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.

**నదీ తీరంలో....** గోదావరినది వద్ద పురపాలకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు గతంలో కంటే కొంత మెరుగైనా ఇంకా పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది. పురపాలకసంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ఆధ్వర్యంలో ఇప్పటికే రెండు పుష్కరఘాట్ల వద్ద చెత్తచెదారాన్ని తొలగింపజేసి, మెట్లపై ఇసుక పోయించి పాకురును తొలగింపజేశారు. పది చోట్ల చెత్తకుండీలను ఏర్పాటు చేశారు. దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు.

**మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలి**

ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున కరీంనగర్, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను నడిపించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ధర్మపురికి మెరుగైన రవాణా



సదుపాయం లేక భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనితో పాటు ప్రత్యేకంగా ఆలయం వద్దకు వృద్ధులు, దివ్యాంగులు చేరేలా ఉచిత సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ బస్టాండు వద్ద కనీస సదుపాయాలు లేవు. పూర్తి స్థాయి కంట్రోలర్‌ను నియమించలేదు. తాగు నీటి సదుపాయాలు ఏమాత్రం లేవని భక్తులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్టాండులో సదుపాయాలు మెరుగు పరచాల్సిన అవసరం ఉంది.

**సమన్వయ సమావేశమేదీ..?**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. ఆలయంలో విద్యుద్దీపాలం కరణ, ఉత్తర ద్వారం, ఉత్సవ వేదికలకు రంగులు వేయాల్సిన అవసరం ఉంది. ఈ పనులను త్వరిత గతిన ప్రారంభించాల్సి ఉంది. స్వామివారి ఊరేగింపు సేవలు చేపట్టే మార్గాలన్నీ అధ్వానంగా మారాయి. పలు రోడ్లు బండరాళ్లు, గుంతలతో ఇబ్బందికరంగా మారాయి. ముక్కోటి ఏకాదశి ఉత్సవ తేదీలపై ముందస్తుగా ప్రచారం చేపట్టడం లేదు. దేవస్థానంలో కొన్నేళ్లుగా, ఉత్సవాల పూజలు, ఉత్తర ద్వారాన్ని తెరవడం ఆలస్యంగా జరుగుతోందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ధరల పతనంతో అయోమయం..!

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'తేజ' మిరప ధరలు పతనమవుతున్నాయి. చైనా దేశంతో పాటు కర్ణాటకలో పండిన పంట వల్ల ఇక్కడి ధరలపై ప్రభావం పడుతోంది. గతేడాది పంట నిల్వ చేసి నష్టపోయిన వ్యాపారులు ప్రస్తుతం మిరపను కొనే పరిస్థితి లేకపోవటం మరో కారణం. మిరపకాయల నుంచి నూనె తయారుచేసే కర్మాగారాల యజమానులు సైతం ఖమ్మం విపణిలో కాకుండా కర్ణాటకలోనే కొంటుండటం గమనార్హం.

**దెబ్బతీసిన చైనా పంట..**

చైనాలో మిరప పంట జూన్, జులై, ఆగస్టులో వస్తుంది. దాదాపు ఖమ్మం జిల్లాలో తేజ రకానికి దగ్గరగా ఉన్న పంటను గతేడాది ఆ దేశస్థులు పండించి విజయవంతమయ్యారు. ఈసంవత్సరం రెండింతల విస్తీర్ణంలో సాగుచేశారు. అక్కడి పంట సైతం వారికి అందుబాటులోకి రావటంతో ఇక్కడి పంట కొనుగోళ్లపై పెద్దగా ఆసక్తి చూపటం లేదని సమాచారం. దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఖమ్మంలో సాగయ్యే తేజ రకం మిరప.. ఎక్కువగా చైనా, థాయిలాండ్, మలేషియా, మెక్సికో



దేశాలకు ఎగుమతి అవుతుంటుంది.

**'ప్రత్యామ్నాయం'తో భారీ మూల్యం**

ఖమ్మం జిల్లా ముదిగొండ, మహబూబాబాద్ సమీపంలోని మన్నెగూడెం, హైదరాబాద్‌లోని సాగర్‌రోడ్డు, ఏపీలోని ఒంగోలులో తేజ మిరప నుంచి ఆయిల్ తయారుచేసే మిల్లులు ఉన్నాయి. ఆరేడేళ్లుగా ఇవన్నీ ఖమ్మం మార్కెట్‌లో తేజ మిరపపై ఆధారపడుతున్నాయి. గతేడాది ధర ఎక్కువగా ఉండటంతో ఈమిల్లుల యజమానులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించారు. దాదాపు తేజ రకానికి సమానంగా కర్ణాటకలో పండిస్తున్న మిరపను పరిశీలించారు. ఇక్కడి కంటే క్వింటా రూ.3వేలు తక్కువ ధర పలకటంతో అక్కడి నుంచి పెద్దఎత్తున కొన్నారు. తద్వారా ఖమ్మం విపణిలో సుమారు 10లక్షల బస్తాలను కొనే దిక్కులేకుండా పోయింది. రైతులు, వ్యాపారులు తక్కువ ధరకు సరకు అమ్మలేక శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు.

**రూ.400 కోట్లకు పైగా నష్టం**

గతేడాది రైతులు, వ్యాపారులు సుమారు 20లక్షల బస్తాల(ఎనిమిది లక్షల క్వింటాళ్లు)ను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. అప్పట్లో క్వింటా ధర రూ.21-22వేలు పలికింది. మరింత పెరుగుతుందని భావించి భంగపడ్డారు. సగటున క్వింటాకు రూ.5వేల చొప్పున నష్టపోయారు. ఈలెక్కన ఖమ్మం జిల్లాలో రైతులు, వ్యాపారులు సుమారు రూ.400కోట్లు నష్టపోయినట్లు తెలుస్తోంది. వ్యాపారులకు కొనుగోలు శక్తి తగ్గింది.

ఇక్కడి నుంచి విదేశాలకు ఎగుమతులు బాగుంటేనే మిర్చికి డిమాండ్ ఉంటుంది. రైతులు నాణ్యమైన సరకు తీసుకొస్తే డిమాండ్ పెరుగుతుంది. దీనివల్ల విదేశాల నుంచి మనకు భారీగా ఆర్డర్లు వస్తాయి. గతేడాది నుంచి క్రమేణా ధరలు తగ్గుముఖం పట్టాయి. విదేశాల నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు లేకపోవటమే ప్రధాన కారణం. యద్దనపల్లి సతీష్, మిర్చి శాఖ కార్యదర్శి, ఖమ్మం

# గుర్రపుడెక్కతో మొక్కరైతు కన్నీరు

చింతకాని : జిల్లాలోని '21 ఎంబీసీ' (మెయిన్ బ్రాంచ్ కెనాల్) పరిధిలో ఎక్కువ సాగు విస్తీర్ణమున్న చింతకాని మేజర్ కాలువ పూర్తిగా గుర్రపుడెక్క, నాచుతో నిండిపోయింది. 11,000 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పైరుకు నీరందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ ప్రవాహం** చింతకాని మేజర్ కాలువ 18.8 కిలోమీటర్ల పరిధిలోని పాలేరుకు నీరందుతుంది. పుట్టకోట వద్ద 0 కి.మీ. నుంచి 7వ కిలోమీటర్ అల్లీపురం వరకు ఖమ్మం అర్బన్ మండలం పరిధిలోకి వస్తుంది. 7వ కి.మీ. బస్వాపురం నుంచి 18.8 కి.మీ మత్కేపల్లి నామవరం వరకు చింతకాని మండలంలోకి వస్తుంది. ఈ మండల పరిధిలో 11వేల ఎకరాల మొక్కజొన్న సాగైంది.

**సమస్య ఏంటి?**



ఖమ్మం అర్బన్ పరిధిలో 7 కి.మీ.ల మేర కాలువలో పూర్తిగా గుర్రపుడెక్క, నాచు చేరటంతో నీరు ముందుకు కదలటం లేదు. పూర్తిస్థాయిలో 140 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నప్పుడు కాలువ పొర్లి పుట్టకోట చెరువు వద్ద కట్ట మీదుగా ప్రవహిస్తోంది. కట్ట తెగే ప్రమాదం ఉండటంతో కేవలం 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు చేరటం లేదు.

**ఎవరికి ఇబ్బంది?**

బస్వాపురం, రామకృష్ణాపురం, రాఘవాపురం, కొదుమూరు, లచ్చగూడెం, చింతకాని, నరసింహాపురం, జగన్నాథపురం మత్కేపల్లి నామవరం గ్రామాల్లో మొక్కజొన్న పైరు కంకిపాప, పాలపొట్ట దశలో ఉంది. ఈ దశలో నీరు ఎంతో అవసరం. కానీ సరిపడా రావటం లేదు. రైతులు ఎన్నిసార్లు సమస్య పరిష్కరించాలని కోరినా ప్రయోజనం లేకుండా పోయింది.పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. అడిగితే ఖమ్మం అర్బన్ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. అనేకసార్లు ఎన్నెస్పీ అధికారులకు సమస్య విన్నవించినా ప్రయోజనం లేదు.దండా విశ్వనాథం, చింతకానిరైతులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియపర్చాం. వారి సూచనల మేరకు అర్బన్ ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.రాంప్రసాద్, ఎన్నెస్పీ డీఈ

# ఎగువ మానేరుకు మల్లన్న సాగర్ నీరు



గంభీరావుపేట: ఎగువ మానేరు ఆయకట్టు రైతులు జలాశయంలో ఉన్న సాగునీటితో పూర్తి స్థాయిలో పంట పండుతుందో, లేదోనని మొన్నటి వరకు ఆందోళన చెందారు. ముఖ్యంగా ముస్తాబాద్ మండలంలోని ఆయకట్టు రైతులు యాసంగి పంటకు సాగునీరు అందటం లేదని వాపోయారు. ప్రస్తుతం మల్లన్నసాగర్ నుంచి ఎగువ మానేరు జలాశయానికి నీరు వదలడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయం సామర్థ్యం రెండు టీఎంసీలు. డిసెంబర్‌లో 5, 10 తేదీల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. ఆ సమయంలో 1.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పది వేల ఎకరాలకు అధికారులు తైబంది చేశారు. ఎడమ కాలువ ద్వారా 670 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 9,330 ఎకరాలకు నీరు అందించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 0.7 టీఎంసీని సాగుకు విడుదల చేశారు. నీటిని పొదుపు చేస్తూ వదులుతున్నారు. అయితే చివరి ఆయకట్టు వరకు నీరు అందక పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి ద్వారా నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మల్లన్నసాగర్ జలాశయం నుంచి 0.5 టీఎంసీ నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చి అక్కడి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు విడుదల చేశారు. ఈ నెల 2న రాత్రి వరకు ఎగువమానేరు జలాశయానికి నీరు చేరుకుంది. 0.5 టీఎంసీ రావడానికి దాదాపు పది రోజులు పడుతుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో పంటకు నీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు.

**ఆందోళన తొలగింది**

పంట చివరి దశలో ఎండిపోతుందని మొన్నటి వరకు ఆందోళన చెందాం. ఇటీవల మా ఎడమ కాలువకు వారబంది పెట్టడంతో పంటలు ఎండిపోతాయని అనుకున్నాం. ప్రస్తుతం మల్లన్నసాగర్ జలాశయం నుంచి ఎగువమానేరుకు నీటిని విడుదల చేయడంతో ఆందోళన తొలగింది. ప్రతి ఎకరాకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జంగం కిష్టయ్య, నర్మాల రైతు

**రైతులకు అండగా...**

రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎగువమానేరు జలాశయం ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 0.5 టీఎంసీ నీరు మానేరు జలాశయానికి మల్లన్నసాగర్ నుంచి విడుదల చేస్తున్నారు. కేకే మహేందర్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రికి రైతుల సమస్యను వివరించగా వెంటనే మల్లన్నసాగర్ నుంచి విడుదల చేస్తున్నారు.– హమీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

**ప్రతి ఎకరానికీ అందుతుంది**

ప్రతి ఎకరానికి నీరు అందించాలనే ఉద్దేశంతో నీటిని పొదుపుగా విడుదల చేస్తున్నాం. మల్లన్నసాగర్ నుంచి 0.5 టీఎంసీ వస్తుందని అంచనా వేశాం. ప్రతి ఎకరానికీ అందుతుంది. రైతులు ఆందోళన చెందవద్దు. దాదాపు పది రోజుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవాలి.– నర్సింగ్, ఇరిగేషన్ డీఈఈ

# కళ తప్పిన సినారె మందిరం



వేములవాడ : కళలు, కళాకారులకు పుట్టినిల్లుగా పేరొందిన వేములవాడ ప్రాంతంలోని సినారె కళా మందిరం కళావిహీనంగానే మారింది. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో అధ్వానంగా తయారైంది. వేములవాడ ప్రాంతంలోని కళాకారులను, కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 2002 సంవత్సరంలో సినారె రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు రూ.50 లక్షలతో కళా భవనాన్ని అన్ని హంగులతో నిర్మించారు. విశాలమైన స్థలంలో దాదాపు వేయి మంది పైగా కూర్చుని కార్యక్రమాలు తిలకించే విధంగా రూపకల్పన చేసి నిర్మాణం చేశారు. కళా భవనంలో డ్రెస్సింగ్ గది, మూత్రశాలలు తదితర అన్ని వసతులతో నిర్మించినప్పటికీ నిర్వహణ లేక అధ్వానంగా మారింది. కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. భవనంలోని సీలింగ్ శిథిలమైంది. తలుపులు పాడయ్యాయి. విద్యుత్ వైరింగ్ దెబ్బతింది. ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. జిల్లా స్థాయిలో జరిగే అనేక కార్యక్రమాలను ఇందులోనే నిర్వహించేవారు. యువజనోత్సవాలు వంటివి కూడా భారీ స్థాయిలో జరిగేవి. అలాంటి కళామందిరం నేడు ఆలనా పాలనా లేకుండాపోయింది. దీనిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ప్రస్తుతం రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

**కానరాని నిధుల జాడ**గత ప్రభుత్వ హయాంలో ఈ భవనం స్థానంలో రూ.10 కోట్లు వెచ్చించి కొత్తది నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ఇందుకు ముందుగా రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కానీ నిధుల జాడ లేదు. మరోవైపు భవనం నాణ్యతగానే ఉండటంతో అవసరమైన మరమ్మతులు చేసి ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులు భావించారు. ఏళ్లు గడుస్తున్నా అది కూడా కార్యరూపం దాల్చడం లేదు. మొదట్లో ఈ భవనం మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో ఉండేది. ప్రస్తుతం పురపాలక సంఘం అధికారుల ఆధీనంలో ఉన్నా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రస్తుతం భవనం పైఅంతస్తులో నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ కార్యాలయం కొనసాగుతోంది. కింద గదిలో ఆధార్ కేంద్రం నడుస్తోంది. భవనం మాత్రం ఆలనా పాలనా కరవై అస్తవ్యస్తంగా మారింది.

**చెత్త ఆటోలకు నిలయంగా...**

కళాకారులతో కళకళలాడాల్సిన కళామందిరం మున్సిపల్ చెత్త ఆటోలు, ట్రాక్టర్లకు నిలయంగా మారింది. మున్సిపల్ కార్యాలయం వద్ద స్థలం కొరత వల్ల కళామందిరం ఆవరణలో పార్కింగ్ చేస్తున్నారు. గేట్లు కూడా వేయకపోవడంతో ప్రైవేటు వ్యక్తులు కూడా ఇక్కడే వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికైనా కళామందిరానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కళాకారులు, కళాభిమానులు కోరుతున్నారు.

**ఆర్అండ్‌బీ పరిశీలనలో...**కళామందిరానికి సంబంధించి మున్సిపల్ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. గతంలోనే నూతన భవనం నిర్మాణానికి పంపించారు. సినారె కళామందిరం మరమ్మతులు ఆర్అండ్‌బీ అధికారుల పరిశీలనలో ఉన్నాయి. నిధులు వస్తే వారు పనులు చేపడతారు.– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# ఆర్ఆర్ఆర్ ప్రతిపాదన సాకు.. ఇళ్ల అనుమతులకు ఆపసోపాలు!

నర్సాపూర్: జిల్లాలో ప్రాంతీయ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి మూడు రకాల సర్వేలు చేసి ఒకదానిని ఖరారు చేశారు. మిగతా రెండు చోట్లా ప్రతిపాదిత భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొందరు ఎలాగోల నిర్మాణాలు చేపట్టడంతో అక్రమ నిర్మాణాలంటూ సంబంధిత అధికారులు వారికి నోటీసులు ఇస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరించుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈ పరిస్థితి నర్సాపూర్, తూప్రాన్ పురపాలికలతో పాటు, ఆయా పంచాయతీల్లో నెలకొంది.

**నర్సాపూర్‌లోనే 200 మంది**గతంలో ప్రతిపాదిత భూముల్లో నిర్మాణాలు చేపట్టుకోవడానికి అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నర్సాపూర్ పురపాలికలో సుమారు 200 మంది ఎదురుచూస్తున్నారు. కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నా అనుమతులు రావడం లేదు. మరికొందరు ఇళ్లు నిర్మించుకోవడంతో వాటిని ఎల్ఆర్ఎస్‌లో క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

**బ్యాంకు రుణాలు రాకున్నా..**రెండు చోట్ల అనుమతులు రాకున్నా ధైర్యం చేసి నిర్మాణాలు చేపట్టిన వారికి బ్యాంకుల నుంచి రుణాలు రావడం లేదు. ప్లాట్లు కొనుగోలు చేసి తిరిగి సొంతంగా డబ్బులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టడానికి పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**మొదటి సర్వే..** నర్సాపూర్ పురపాలిక పరిధిలో గతంలో సంగారెడ్డి మార్గంలోని రుస్తుంపేట కమాన్ సమీపంలోంచి, మెదక్ మార్గంలోని సీతారాంపూర్, గోకుల్ కాలనీ మీదుగా, వెల్దుర్తి మార్గంలో ఖండసారి షుగర్ ఫ్యాక్టరీ వరకూ ట్రిపుల్ ఆర్ వెళ్తుందని సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లో హద్దులు కూడా ఏర్పాటు చేశారు.

**రెండో సారి..** నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాల్లోని బ్రాహ్మణపల్లి, నాగ్సన్‌పల్లి, శివ్వంపేట మండలం పిల్లుట్ల తదితర ప్రాంతాల మీదుగా సర్వే చేశారు.

మూడో సారి.. పై రెండింటిని పక్కన పెట్టి ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ నిర్మాణం రెడ్డిపల్లి సమీపంలోంచి చేపట్టనున్నట్లు ప్రకటించారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

రామకృష్ణారావు, పురపాలిక కమిషనర్, నర్సాపూర్

అనుమతుల విషయాన్ని జిల్లా కలెక్టర్, సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం.ట్రిపుల్ ఆర్ ప్రతిపాదిత భూములని పేర్కొన్న వాటికి ఇవ్వడం లేదు. ఇలా నర్సాపూర్‌లో 200 లకు పైనే ఉంటాయి. ఆన్‌లైన్‌లో హెచ్ఎండీఏ డీనోటిఫై చేయడం వల్లే ఈ సమస్య పరిష్కారమవుతుంది. అంతవరకు అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు ఎల్ఆర్ఎస్‌ను ఉపయోగించుకోవాలి.

# స్థానిక చర్చలు మొదలు

కొత్తగూడెం : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మరో రెండు వారాల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనటంతో ఉభయ జిల్లాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏడాది కాలంగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఈనేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడు తేదీలు ప్రకటించినా పక్రియ నిర్వహించేందుకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**రిజర్వేషన్ల వైపు ఆశావహుల చూపు**

గత ప్రభుత్వం పంచాయతీ రిజర్వేషన్లను పదేళ్లపాటు అమలయ్యేలా.. 2019లో పంచాయతీరాజ్ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం రిజర్వేషన్లు మార్చకుండా ఎన్నికలు నిర్వహించాలి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కొత్త విధానాన్ని అమలుచేయనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో ఎస్సీలకు 15, ఎస్టీలకు 7, బీసీలకు 28 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. అందులో మహిళలకు 50 శాతం ఉంటుంది. గత ఎన్నికల్లో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీసీ గణన చేపట్టి అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈసారి ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటున్న వారందరూ తమ స్థానాల్లో ఏ రిజర్వేషన్ ఖరారవుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



**తేలనున్న బీసీ రిజర్వేషన్లు..**

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు త్వరలోనే ఖరారు కానున్నాయి. బీసీలకు రిజర్వేషన్లు కేటాయించేందుకు కీలకంగా మారిన సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలోని ముఖ్యాంశాలను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని బీసీ జనాభా లెక్కలను సైతం తేల్చింది. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన ప్రత్యేక (డెడికేటెడ్) కమిషన్ త్వరలోనే నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. వార్డులు, గ్రామాలు, మండలాలు, జిల్లాలు, పట్టణ స్థానిక సంస్థల వారీగా బీసీ జనాభా ప్రకారం గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. దీనిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై బీసీ రిజర్వేషన్లు ఆధారపడి ఉంటాయి.

**ఆలోచింపజేస్తున్న లఘుచిత్రాలు..**

ఓవైపు గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చలు జరుగుతుంటే.. మరోవైపు ఎన్నికల్లో అభ్యర్థులు చేసే వ్యయం, దానివల్ల తలెత్తే సమస్యలపై సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న లఘుచిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. అప్పులు చేసి పంచాయతీ ఎన్నికల బరిలో నిలిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయనే అంశాన్ని సందేశాత్మకంగా వివరిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచి పరిమితికి మించి ఖర్చు చేయటం వల్ల చివరికి ప్రాణాలు తీసుకునే పరిస్థితులు దాపురిస్తాయంటున్నాయి.

# సౌర వెలుగు.. ఆదాయం సులువు!

ఆసిఫాబాద్ : మహిళలు వ్యాపారపరంగా రాణించి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాలతో సౌరశక్తి విద్యుత్తు ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన నిధులను బ్యాంకు ద్వారా రుణం ఇప్పించడంతోపాటు ప్రభుత్వ స్థలాలను కేటాయించేలా చూడాలని ఆదేశించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు.. రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాలను గుర్తిస్తున్నారు. విద్యుత్తు ఉపకేంద్రాలకు 4-5 కి.మీ. చుట్టుపక్కల స్థలం ఉండేలా చూస్తున్నారు. జిల్లాలో 400 ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యం విధించారు.

**ఉపకేంద్రాల సమీపంలో 141 ఎకరాల గుర్తింపు**

జిల్లాలో 33/11 కేవీ, 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాలు మొత్తం 38 ఉన్నాయి. వీటి సమీపంలోని సర్కారీ స్థలాలను గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గుర్తిస్తున్నారు. ఇప్పటికే 13 మండలాల్లోని 27 ప్రాంతాల్లో పరిశీలించారు. 141.21 ఎకరాలను గుర్తించారు. వీటిలో కొన్నిచోట్ల 1-5 ఎకరాల మధ్య భూమి ఉండగా, మరికొన్నిచోట్ల అంతకు మించి ఉన్నట్లు గుర్తించారు. వీటిలో యూనిట్ల స్థాపనపై టీజీ రెడ్కో అధికారులు ఆమోదించాక ప్రభుత్వానికి నివేదిస్తారు. ఒక్క మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తి యూనిట్ నెలకొల్పేందుకు 3.5-4 ఎకరాల భూమి అవసరం. మొదట రెండు మెగావాట్ల యూనిట్ మోడల్‌గా ఏర్పాటు చేయాలనే ఆదేశాలతో.. రెబ్బెన మండలం నంబాల ఉపకేంద్రం సమీపంలోని ఎనిమిదెకరాల భూమిని ఇప్పటికే కలెక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించారు. ఏర్పాటుకు అధికారులు సిద్ధమవగా.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా నిలిచింది.

**బ్యాంకుల ద్వారా రుణం..**

ఒక మెగావాట్ సౌర విద్యుత్తు ఉత్పత్తి యూనిట్ నెలకొల్పేందుకు రూ.3 కోట్ల వరకు వ్యయమవుతుంది. దీనిలో మండల సమాఖ్యలు 10శాతం వెచ్చిస్తే.. మిగతావి బ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తారు. సోలార్ ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును యూనిట్‌కు రూ.3.13 చొప్పున డిస్కంలు కొనుగోలు చేయనున్నాయి. ఒక్క మెగావాట్ విద్యుత్తు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుతో రోజుకు సుమారు 4 వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**కొన్నిచోట్ల స్థలాల గుర్తింపు**

దత్తారావు, డీఆర్‌డీవో

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే రెవెన్యూ అధికారులతో కలిసి కొన్ని స్థలాలను గుర్తించాం. నంబాల ఉపకేంద్ర సమీపంలో త్వరలో రెండు మెగావాట్ల యూనిట్ ఏర్పాటు చేస్తాం. ఆయా యూనిట్లను ఏ సమాఖ్యలకు అప్పగించాలి. వారి వద్ద అందుబాటులో ఉన్న నిధుల వివరాలను పరిశీలిస్తున్నాం.

# కాలిబాట.. కాసుల మూట!

హైదరాబాద్ : పాదచారులు నడవాల్సిన ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటవుతున్నాయి.. వాహనాలు ప్రయాణించే రోడ్లపై తోపుడుబండ్లు నడుస్తున్నాయి.. ఆయా వ్యాపార కేంద్రాల్లో మెజార్టీ స్థానిక నేతలు, రకరకాల సంఘాలకు చెందినవి. రాజకీయ నాయకుల మంటూ, సామాజిక కార్యక్రమాల పేరుతో ప్రజల ఆస్తులను ముందు కబ్జా చేస్తారు. తోపుడు బండ్లు, రేకుల డబ్బాలను ఏర్పాటు చేసి దర్జాగా.. నెలకు రూ.10వేల నుంచి రూ.20వేలు తీసుకుని చిరువ్యాపారులకు అద్దెకిస్తారు. ఆయా దుకాణాలే రోడ్డును ఆక్రమించాయనుకుంటే.. వాటి దగ్గరకొచ్చే వాహనాలతో రహదారులు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్యలో సగటు నగరవాసి దైనందిన జీవితంలో రోజూ అరగంట సమయాన్ని కోల్పోతున్నాడు. నానాటికీ పెరుగుతోన్న ఈ సమస్య ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

**చిరువ్యాపారుల విధానంపై బల్దియా నిర్లక్ష్యం..**

నగరంలో చిరువ్యాపారులు 1.6లక్షల మంది ఉన్నారు. అందులో తోపుడు బండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎందరనే వివరాలు



బల్దియా వద్ద ఉన్నాయి. వ్యాపారాలకు అనువుగా ఉన్న స్థలాలను గుర్తించి, స్ట్రీట్ వెండింగ్ జోన్లను సిద్ధం చేయాల్సిన బాధ్యత జీహెచ్ ఎంసీదే. బల్దియా యూసీడీ అధికారులను వివరణ కోరితే.. ప్రయత్నం చేస్తున్నామంటూ దాట వేస్తున్నారు.

**ఇవిగో ఉదాహరణలు..**

ఎస్సార్‌నగర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపైనే ఓ కమ్యూనిటీ హాల్ ముందున్న కాలిబాట మొత్తం ఆక్రమణలతో నిండిపోయింది. ఇలా ఆక్రమించారేంటని అడిగితే.. పక్కనున్న కమ్యూనిటీ హాల్ ప్రతినిధులకు నెలకు రూ.15వేలు అద్దె చెల్లిస్తున్నామని ఓ వ్యాపారితో తెలిపారు. ఇలాంటివి ఇక్కడ అన్ని రహదారులపై ఉన్నాయి.

ఎన్టీఆర్ మార్గ్‌లో అడుగడుగునా స్థిరమైన తోపుడుబండ్లు ఉంటాయి. అవి ఖైరతాబాద్‌లోని కొందరు రాజకీయ నాయకులవి.

జేఎన్‌టీయూ చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకు, అక్కడి నుంచి కేపీహెచ్‌బీ 9వ ఫేజ్ రోడ్డు, రోడ్డు నెం.1కు చేరుకునే రోడ్లపై కాలిబాటలు పూర్తిగా కనుమరుగయ్యాయి.కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు నుంచి ప్రధాన రహదారి వరకు, కేపీహెచ్‌బీ రహదారి సర్వీసు రోడ్ల వరకు అదే పరిస్థితి.

# విలీన గ్రామాలపై ప్రత్యేక దృష్టి



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలు, పురపాలికల పరిధిలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా, సేవల్లో సమస్యలు రాకుండా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తపల్లి పురపాలికతోపాటు చింతకుంట, మల్కాపూర్-లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామపంచాయతీలు నగరపాలికలోకి కలిసిపోయాయి. పురపాలిక, పంచాయతీ బోర్డుల స్థానంలో వార్డు కార్యాలయాలుగా నామకరణం చేశారు. గ్రామాల్లోని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఆస్తిపన్నులు, తదితర రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు.

**నిలిచిన గ్రామ, పురపాలిక వెబ్‌సైట్**

విలీనం కాకముందు పంచాయతీ పోర్టల్‌లో గ్రామాల పేర్లు కనిపించేవి. దీని ఆధారంగానే భవన అనుమతులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే వారు. ప్రస్తుతం ఆ వెబ్‌సైట్ నుంచి గ్రామాల పేర్లను తొలగించారు. కొత్తపల్లి పురపాలికకు సంబంధించిన పేరు కూడా వెబ్‌సైట్‌లో కనిపించడంలేదు. జిల్లాలో మూడు పురపాలికలు, ఒక కార్పొరేషన్‌గానే సూచిస్తుంది. అంటే కొత్తపల్లి కార్యకలాపాలన్నీ కరీంనగర్ కార్పొరేషన్‌లోకి బదిలీ కానున్నాయి.

**బల్దియా ప్రకారమే పారిశుద్ధ్య పనులు** కొత్తపల్లితోపాటు విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో మార్పులు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉదయం, మధ్యాహ్నంతోపాటు చెత్త సేకరణ పకడ్బందీగా జరిగేలా కార్మికులకు ఆదేశాలు జారీ చేశారు. కార్మికులుగా గుర్తించేందుకు ఆఫ్రాన్ ధరించాలని ఆదేశించారు. మురుగుకాలువలు శుభ్రం చేయాలని, రహదారులు ఊడ్చి ఎప్పటికప్పుడు ఫొటోలు వాట్సాప్ గ్రూపులో పెట్టాలని సూచించారు. త్వరలోనే వీరికి బయోమెట్రిక్ హాజరు అమలు చేయనున్నారు.

**తాత్కాలికంగా అనుమతులు, పన్నుల వసూలు..**

విలీన గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బందులు రాకుండా తాత్కాలికంగా అనుమతులు, ఇతర పనులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నల్లా, ఆస్తి పన్నులను మాత్రం రసీదు పుస్తకాల ద్వారా తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలందించేందుకు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు కమిషనర్ లేఖ రాసినట్లు సమాచారం. పాత ఆస్తి పన్ను ఎప్పటి వరకు ఉంటుంది? కార్పొరేషన్ ఆస్తి పన్ను ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది రాష్ట్రం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఈ విధివిధానాలు ఖరారు కావడానికి కొన్ని నెలల సమయం పట్టవచ్చు.

**వార్డు అధికారులకు బాధ్యతలు..**విలీన గ్రామాల్లో కనీస సౌకర్యాల పర్యవేక్షణకు ఒక వార్డు అధికారిని కేటాయించి బాధ్యతలు అప్పగించేందుకు ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు వంటి సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించేలా వీరు చర్యలు తీసుకుంటారు. అయితే కొన్ని నెలలపాటు ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఉద్యోగులతోనే నడిపించాలని నిర్ణయించారు. పారిశుద్ధ్య కార్మికులను మినహాయిస్తే మిగతా వారందరికీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు.

# కొత్త లబ్ధిదారులకు బియ్యం

హుజూరాబాద్: కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ చేయనున్నారు. గత నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మండలానికో గ్రామం చొప్పున ఎంపిక చేసి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులకు కొత్త కార్డులు ఇచ్చిన విషయం తెలిసిందే. వీరందరికీ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతోపాటు ఇందుకు అవసరమైన కోటాను ఆయా జిల్లాలకు కేటాయించింది.

**1,608 కార్డులు.. 9,663 మంది లబ్ధిదారులు**

ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలు, 14 పురపాలికలు, రెండు నగర పాలికల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి జాబితాలో ఉన్నవారి పేర్లను చదివి వినిపించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గత నెల 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంక్షేమ పథకాలను ప్రారంభించే లక్ష్యంతో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులుగా గుర్తించి ఉమ్మడి జిల్లాలోని 1,608 మందికి రేషన్ కార్డులు అందజేశారు. కొత్త కార్డుల్లో 9,663 యూనిట్లు (లబ్ధిదారులు)



నమోదవగా ఈ నెల నుంచి వారికి బియ్యం పంపిణీ చేయనున్నారు. కొత్త కార్డుల్లోని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గానూ ఉమ్మడి జిల్లాకు ఈ నెలలో 54.751 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెరిగింది.

మరోవైపు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హులైన మిగతా లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్త రేషన్ కార్డుల కోసం నాలుగు జిల్లాల్లో కలిపి 1,01,103 దరఖాస్తులు వచ్చాయి. అర్హులను గుర్తించే ప్రక్రియను ఈ నెలాఖరు లోగా పూర్తి చేసి వచ్చే నెల నుంచి వారికి కూడా బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కరీంనగర్ పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావు మాట్లాడుతూ గత నెలలో మండలానికో గ్రామంలో పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ జరుగుతుందని చెప్పారు. వచ్చే నెలకు కార్డులు, లబ్ధిదారుల సంఖ్య మరింత పెరుగు తుందన్నారు. రేషన్ కార్డుల జారీ, సభ్యుల పేర్లు చేర్చడం, అనర్హుల పేర్లు తొలగించడం నిరంతర ప్రక్రియ అని అర్హులందరికి రేషన్ కార్డులు వస్తాయని చెప్పారు. పాత రేషన్‌కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు మీ-సేవ కేంద్రాల్లో వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇంకా తమ లాగిన్‌లోకి రాలేదని, ఈ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే నూతన సభ్యుల పేర్లను చేర్చుతామని చెప్పారు.

# ప్రాణ జలం పదిలమే..

పెద్దపల్లి : ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు పైపైకి ఉబికివస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండటంతో నీటి లభ్యత మెరుగ్గానే కనిపిస్తోంది. గత నెలతో పోల్చితే స్వల్పంగా తగ్గినప్పటికి పెద్దగా ప్రమాదమేమీ లేదు. రామగిరిలో 2.64 మీటర్ల లోతులో ఉంది. జిల్లా వ్యాప్తంగా గత నెల కంటే 0.27 శాతం మాత్రమే తగ్గింది. జిల్లాలో సగటునా 4.95 మీటర్ల లోతులో నీటి మట్టం ఉంది.

**మంథనిలో ప్రతికూలం**

గోదావరి పరీవాహక ప్రాంతమైన మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో 20.25 మీటర్లు, మంథని పట్టణంలో 16.65 మీటర్ల లోతులో నీరు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అంతర్గాం మండలంలో 2.71 మీ., ధర్మారంలో 3.82 మీ., ఎలిగేడులో 5.09 మీ., జూలపల్లి 4.60 మీ., కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో 3.56 మీ., ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో 3.79 మీ., ఓదెలలో 3.01 మీ., పాలకుర్తిలో 3.44 మీ., పెద్దపల్లి మండలం బోజన్నపేటలో 3.56 మీ., రామగిరి మండలం ముస్త్యాలలో 2.64 మీ., రామగుం డంలో 6.32 మీ., శ్రీరాంపూర్‌లో 5.87 మీ., సుల్తానాబాద్ మండలం కనుకులలో 2.98 మీటర్ల లోతులో ఉన్నట్లు నమోదైంది.

**పొదుపుతో భరోసా**జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. గోదావరి, మానేరు, హుస్సేన్‌మియా, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఎక్కువ వరి సాగు చేయడంతో నీటి మట్టం భూగర్భంలో పదిలంగానే ఉంది. గతేడాది డిసెంబరులో 4.78 మీటర్లు ఉండగా ప్రస్తుతం 4.95 మీటర్లుగా నమోదైంది. వానాకాలంలో భారీ వర్షాలు కురవడంతో చెరువుల, కుంటలు, వాగుల్లో నీరు సమృద్ధిగా ఉండటంతో భూగర్భ జలాలు తగ్గడం లేదు. నీటిని పొదుపుగా వాడుకుంటే భావితరాలకు ముప్పు తప్పనుంది.

# వ్యవసాయ బావులు.. ప్రమాదానికి దారులు



పెద్దపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేసిన అధికారులు.. రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావులను పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా దర్శనవిస్తున్నాయి. బావులు, ఎస్సారెస్పీ కాలువలు, చెరువుల వెంట రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు జరగడంతో రాత్రిళ్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించడం సాహసంగా మారింది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలోని సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, పెద్దపల్లి మండలం రంగంపల్లి వద్ద రాజీవ్ రహదారికి ఆనుకునే చెరువు ప్రవాహాలు వెళ్తున్నాయి. కానీ ఇక్కడ ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల గుండా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. సుల్తానాబాద్ శివారులోని డి-83 కాలువలో గతంలో వాహనాలు పడిపోయిన ఘటనలు జరిగాయి. పెద్దపల్లిలోని కొంతంవాడ మీదుగా వెళ్లే ఎస్సారెస్పీ కాలువలోకి గతంలో కారు దూసుకెళ్లింది. కుమ్మరికుంట నుంచి జూలపల్లి వచ్చే ఆర్‌అండ్‌బీ రోడ్డు కొంతదూరం కాలువ వెంటే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పెద్దపల్లి నుంచి కూనారం వెళ్లే దారిలో మారేడుగొండ, కాల్వశ్రీరాంపూర్ నుంచి గుంపులకు వెళ్లేదారిలో పలు బావులతో పాటు చెరువులు, కుంటలు రోడ్డు వెంటే ఉన్నాయి. ధర్మారం, మంథని, కాల్వశ్రీరాంపూర్‌లలో రహదారి విస్తరణ సమయాల్లో ప్రమాదకర బావులను పట్టించుకోలేదు. ముత్తారం మండలం మచ్చుపేట శివారు నుంచి దారి పొడవునా పది వరకు వ్యవసాయ బావులున్నాయి. పెద్దపల్లి నుంచి జూలపల్లి దారిలో వెంకట్రావుపల్లి, వడ్కాపూర్ సమీపంలో.. కుమ్మరికుంట నుంచి కొత్తూరు మీదుగా కటికెనపల్లి దారిలో.. పెద్దపల్లి నుంచి ముప్పిరితోట మీదుగా దూళికట్ట వెళ్లే రోడ్డులో.. జిల్లా కేంద్రం నుంచి తుర్కల మద్దికుంట వెళ్లేదారిలో గాంధీనగర్ దాటిన తరువాత.. బంధంపల్లి స్టేజీ వద్ద, బంధంపల్లి నుంచి గొల్లపల్లి వెళ్లేదారిలో మరో వ్యవసాయ బావులు రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్నాయి.

గార్డ్ పోల్స్ ఏర్పాటు చేస్తాం

రోడ్డు విస్తరణ జరిగిన ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. ఇలాంటిచోట్ల ప్రమాదాల నివారణకు గార్డ్ పోల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. త్వరలోనే జిల్లా అంతటా పోల్స్ ఏర్పాటు చేయిస్తాం. - బావ్‌సింగ్, ఈఈ, ఆర్‌అండ్‌బీ

# ఆన్‌లైన్ సేవలకు దూరం

మల్యాల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో నగదు రహితసేవలు అందుబాటులోకి రాకపోవ డంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. హుండీలో, నిత్యాన్నదాన సత్రానికి విరాళాలు ఇచ్చేందుకు నగదు లేక నిరాశతో వెళ్తున్నారు. నిత్యం స్వామివారి దర్శనానికి 20 వేల మంది భక్తులు తరలివచ్చి హుండీల్లో నగదు, కానుకలు వేస్తుంటారు. హనుమాన్ జయంతి ఉత్సవాల సమయంలో లక్షల్లో వస్తుంటారు. కొందరు వెంట డబ్బులు తీసుకురాలేక ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో విరాళాలు, కానుకలు అందజేయడంలేదు. క్యూఆర్‌కోడ్ లేదా స్వైపింగ్ యంత్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**గతంలో ప్రారంభించినా..**

2017లో అప్పటి జిల్లా కలెక్టరు ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. కొండగట్టు, ధర్మపురి ఆలయాల్లో భక్తులు ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఓ బ్యాంకుకు చెందిన సిబ్బంది స్వైపింగ్ యంత్రంతో ఆలయంలో ఆన్‌లైన్ సేవలకు శ్రీకారం చుట్టినప్పటికీ కొండపైన సెల్‌టవర్ సిగ్నల్ వ్యవస్థలేక రెండు రోజులకే నిలిపివేశారు.

**నగదు రహిత చెల్లింపులకు కృషి**

కొండగట్టులో చరవాణి సిగ్నల్ అందకపోవడంతో భక్తులకు కొంత ఇబ్బంది కలుగుతోంది. సెల్‌టవర్ నిర్మాణం కోసం గతంలో కొండపై స్థలం కావాలని ఓ కంపెనీకి చెందిన అధికారులు అడిగారు. నిబంధనల ప్రకారం ఆలయ భూముల్లో నిర్మాణాలకు దేవాదాయశాఖ కమిషనరు అనుమతితోపాటు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అందుకు ప్రైవేటు కంపెనీ వారు అంగీకరించలేదు. త్వరలో కొండపైన అన్ని సేవలు, అన్నదాన విరాళాల కోసం ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. - కృష్ణప్రసాద్, అంజన్న ఆలయ ఈవో కొండగట్టు

# పల్లీలు.. బెల్లం.. సెనగలు

నిజామాబాద్ : పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించిన విషయం తెలిసిందే. మెరుగైన ఫలితాల సాధన కోసం గతేడాది నవంబరు నుంచి ఉదయం, జనవరి నుంచి ఉదయం, సాయంత్రం రెండు పూటల గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటలకే బడికి వచ్చే విద్యార్థులు నీరసించిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1 నుంచి అన్ని ప్రభుత్వ, స్థానిక, ఆదర్శ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి నిత్యం రూ.15 ఖర్చు చేయాలని సూచించింది. ఈ డబ్బులు త్వరలోనే ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమచేయనున్నట్లు స్పష్టం చేసింది.

38 రోజులు.. రూ.57.30 లక్షలు

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని 10,053 విద్యార్థుల ఆకలి తీరనుంది. ఈ నెల 1వ తేదీ మార్చి 20 వరకు 38 రోజుల పాటు అల్పాహారం అందించనున్నారు. జిల్లాకు రూ.57.30 లక్షలు మంజూరు చేశారు. ఈ స్నాక్స్ మధ్యాహ్న భోజన నిర్వాహకులతోనే తయారు చేయించాలని సూచించారు. నిధులు త్వరలోనే ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లోకి బదిలీ చేస్తామని డీఈవో అశోక్, డీసీఈబీ కార్యదర్శి సీతయ్య వెల్లడించారు.

# మండీలోనే మామిడి కొనుగోలు



జగిత్యాల : జగిత్యాల చల్‌గల్ మామిడిమండీలో ఈ సీజన్‌లో పలు చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన 4 భారీ షెడ్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాగా..వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి అదనంగా తీసుకున్న 10 ఎకరాల స్థలంలోనూ మామిడి కాయల లావాదేవీలు నిర్వహించనుండటం కలిసిరానుంది. కేవలం మామిడి కాయల క్రయవిక్రయాల సీజన్‌లోనే వినియోగించి నిరుపయోగంగా ఉంచే బదులు చల్‌గల్ మండీని శాశ్వత పండ్లమార్కెట్‌గా మార్చేందుకు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వం నిధులు కేటాయించేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాల్సి ఉంది.ప్రభుత్వయార్డు అందుబాటులోకి రావటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సీజన్‌లో దాదాపు 90 మందికిపైగా వ్యాపారులు మామిడి క్రయవిక్రయాలు జరిపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యార్డులోనే మామిడి కాయల కొనుగోలు, ప్యాకింగ్, తరలింపు తదితర కార్యకలాపాలు చేపట్టేలా అంతర్గత రహదారులు, విద్యుత్తు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. దిల్లీ, నాగ్‌పూర్, హైదరాబాద్, విజయవాడ తదితర మార్కెట్ల ధరలు తెలిపేలా చల్‌గల్ మండీలో ఆన్‌లైన్ తెర ఏర్పాటుచేసి ధరలను ప్రదర్శిస్తే రైతులకు మేలు కలగనుంది. ఈ సీజన్‌లోనూ కిసాన్‌రైలు ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు కాయల తరలింపు ధరల స్థిరత్వం తేనుంది.

చల్‌గల్ యార్డులోని రైపెనింగ్ ఛాంబర్‌తో పాటు రెండు ధర్మకాంటాలను వినియోగించాలి. నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకునే వ్యాపారులు కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాలి. గతంలో యార్డులో అభివృద్ధి పనులు పూర్తిగాకపోవటం, వ్యాపారులు వారి సొంతస్థలాల్లోనే సేకరణ చేసినందున వేలానికి వీలుకాలేదు. ప్రస్తుతం యార్డులోనే పూర్తి క్రయవిక్రయాలు సాగనున్నందున వేలంపద్ధతిని పాటిస్తే ధరలు పెరిగి రైతులకు లాభిస్తుంది. ప్రభుత్వం ఎఫ్‌పీవోలు, మహిళా సంఘాలద్వారా కాయల కొనుగోలు, ఉద్యానశాఖ, అపెడ ద్వారా జగిత్యాల బ్రాండ్ పేరిట కాయల ఎగుమతికి చర్యలు చేపడితే కర్షకులకు మరింత మేలు కలుగుతుంది. దశలవారీగా అభివృద్ధిమామిడి మండీ, దినుసుల బీటులో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాము. ఈ సీజనుకు యార్డులోనే మామిడికాయల లావాదేవీలు జరపాలి. కాయల బహిరంగ వేలానికి చర్యలు తీసుకుంటాం.- టి.రాజశేఖర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

# 8 కారిడార్లలో రవాణా ఆధారిత అభివృద్ధి

హైదరాబాద్: మహానగరంలో మరిన్ని రవాణా ఆధారిత అభివృద్ధి(టీవోడీ) కారిడార్లకు హెచ్‌ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ కారిడార్లలో ప్రత్యేక వ్యాపార, వాణిజ్య జోన్ల కోసం లోకల్ ఏరియా ప్లాన్‌లకు రూపకల్పన చేసేలా తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా కారిడార్లలో రోడ్లకు ఇరువైపులా 500 మీటర్ల వరకు ప్రత్యేక నిబంధనలను వర్తింపజేయనున్నారు. అనుమతుల్లో రాయితీలు ఇవ్వనున్నారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని యూనిఫైడ్ మెట్రోపాలిట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఉమ్టా) ప్రత్యేకంగా 2050 అవసరాల కోసం కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ)కు రూపకల్పన చేస్తోంది. మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్‌లో భాగమైన 8 కారిడార్లను టీవోడీ కార్యకలాపాలకు అనుగుణంగా నిబంధనలు రూపొందించనున్నారు. వాటి కోసం లోకల్ ఏరియా ప్లాన్‌లను తయారు చేయనున్నారు.

**ఎంపిక చేసిన మార్గాలివే..**

మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్

జూబ్లీబస్సు స్టేషన్(జేబీఎస్) నుంచి మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)

నాగోలు నుంచి రాయదుర్గ్

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట

మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు

ఎల్‌బీనగర్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్

మెట్టుగూడ నుంచి మల్కాజిగిరి, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్డు

పటాన్‌చెరు నుంచి ఓఆర్ఆర్ జంక్షన్, ఇస్నాపూర్







## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు... ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 6: ఏపీ కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ఇకపై 34 శాతం రిజర్వేషన్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో బీసీలకు కీలక పదవులు దక్కే అవకాశం ఉంది. మొత్తం 21 అంశాలు ఏజెండాగా ఏపీ కేబినెట్ సమావేశం జరుగుతోంది. అలాగే దేశీయ తయారీ విదేశీ మద్యం, బీర్లు, ఎఫ్ఎల్- స్పిరిట్‌పై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రివిజన్‌పై కేబినెట్‌లో ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది మంత్రి మండలి. పలు ముఖ్యమైన అంశాలపై కూడా కేబినెట్‌లో చర్చజరుగుతోంది. విశాఖ గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి గజాల వరకు అభ్యంతరం లేని భూముల నిర్మాణానికి క్రమబద్ధీకరణ చేయాలనే ప్రతిపాదనపై కేబినెట్‌లో ఆమోదం లభించింది. గతంలోనే అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి సవరణ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గాజువాకను ప్రత్యేకంగా తీసుకుని ఈ ప్రాంతంలో వెయ్యి గజాల వరకు కూడా సవరణ చేయలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే పట్టాదారు పుస్తకం విషయంలో కూడా చట్టసవరణకు వచ్చిన ప్రతిపాదనకు సంబంధించి మంత్రిమండలి ఆమోద ముద్ర పడింది. ఇక ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ 2025కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎమ్ఎస్ఏఈ పాలసీని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. బడ్డి ఇండస్ట్రీలిస్టులకు అనేక ప్రోత్సహకాలు ఇచ్చారు. అయితే ఈసారి దాంట్లో స్వల్ప మార్పులు చేస్తూ కేబినెట్ ఆమోదించింది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి వారికి మరిన్ని ప్రోత్సహకాలు అందించే విధంగా కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతో పాటు.. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. పోలవరం నిర్వాసితులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వంలో, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రెండు సార్లు నగుదును రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఓ వైపు పోలవరం నిర్మాణం జరుగుతుండగానే.. మరోవైపు పోలవరం నిర్వాసితులకు రిహబిలిటేషన్ చేసే విధంగా కేబినెట్‌లో చర్చించారు.

## విశ్వసనీయత ఉండాలి కదా.. జగన్ హాట్ కామెంట్స్..

అమరావతి, ఫిబ్రవరి 06: ఏపీలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన కామెంట్స్ చేశారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు పార్టీని వీడటం సహా.. పార్టీ నేతలు, కార్యకర్తలపై నమోదవుతున్న కేసులపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు ప్రత్యేకంగా ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడిన జగన్.. తమ పార్టీ నేతలపై చంద్రబాబు సర్కార్ తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. అంతేకాదు.. లిక్కర్ విషయంలో మిథున్ రెడ్డి పేరును తీసుకురావడంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. లిక్కర్ కేసులో మిథున్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు జగన్. మిథున్ రెడ్డి తండ్రి ఏ శాఖ మంత్రి.. ఆయనకు మద్యానికి సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు మాజీ ముఖ్యమంత్రి. ఎవరో ఒకరిని ఇరికించడం, కేసు పెట్టడం ద్వారా వైసీపీని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని జగన్ ఆరోపించారు. 'ఎవరైనా డబ్బులు ఎందుకు ఇస్తారు.. మద్యం రేట్లు మేము పెంచామా.. మద్యం బేసిక్ రేట్లు పెంచి.. సరఫరా తగ్గించినందుకు నాకు లంచాలు ఇస్తారా.. రేట్లు పెంచి సరఫరా పెంచిన చంద్రబాబుకు మామూళ్లు ఇస్తారా.. నాలాగా ఎందుకు చంద్రబాబు బటన్ నొక్కలేకపోతున్నారు.. నాకు డబ్బుపై వ్యామోహం లేదు.. అందుకే డీబీటీలో రెండున్నర లక్షల కోట్లు ఇచ్చాం.' అని వైఎస్ జగన్ తాను చేసిన పనులను చెప్పుకొచ్చారు.

**విజయసాయి రెడ్డిపై..** ఇదే సమయంలో వైసీపీని వీడుతున్న రాజ్యసభ సభ్యుల అంశాన్ని జగన్ ప్రస్తావించారు. ముఖ్యంగా.. విజయసాయి రెడ్డి అంశాన్ని పేర్కొన్నారు. 'వైసీపీ నుంచి బయటకు వెళ్లే ప్రతి రాజ్యసభ సభ్యుడికి విశ్వసనీయత ఉండాలి. ప్రలోభాలకు లొంగో.. భయపడో లేక రాజీపడో అటు పోతే.. విశ్వసనీయత సంగతేంటి.. రాజకీయాల్లో కష్టాలు ఉంటాయి. ఐదేళ్లు కష్టపడితే మన టైమ్ వస్తుంది. విశ్వసనీయత ముఖ్యం. ఇది విజయసాయిరెడ్డికైనా మిగతా వారికైనా వర్తిస్తుంది.' అని జగన్ అన్నారు.

**ప్రతిపక్ష హోదా ఇస్తేనే..** ఇక అసెంబ్లీకి రావడంపైనా జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి వస్తే తమకు మాట్లాడే సమయం ఇస్తారా? అని జగన్ ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎంకు ఎంత సమయం ఇస్తారో తమకూ అంతే సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లేది లేదని తేల్చి చెప్పారు జగన్. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత జగన్ అసెంబ్లీ ముఖం చేసింది లేదు. వైసీపీ తరఫున 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలుపొందడం.. అసెంబ్లీలో అధికారపక్షాన్ని ఎదుర్కోలేమోననే భయంతో.. జగన్ అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీకి రాకుండా ఉండేందుకు.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతామంటూ మెలిక పెట్టి కూర్చున్నారు జగన్. వాస్తవానికి ఆయన పార్టీ గెలిచిన ఎమ్మెల్యేల లెక్క ప్రచారం అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదు. అయినప్పటికి తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని జగన్ కోరడం.. రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

## విద్యుత్ ఛార్జీలు తగ్గాలి.. బడులు తెరిచేనాటికి డీఎస్సీ పూర్తవ్వాలి: సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ఆయన కొద్దిసేపు మంత్రులతో మాట్లాడారు. వచ్చే మూడు నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు కీలకంగా వ్యవహరించి ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం అమలుపై మంత్రులతో చర్చించారు. ఏప్రిల్‌లో మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని మంత్రులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రం మరో రూ.14 వేలు కలిపి ఇచ్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రంతోపాటు మూడు విడతలుగా రాష్ట్రం ఆర్థిక సాయం ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిపారు. బడులు తెరిచే నాటికి డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్‌మెంట్‌తో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదన్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5 లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎన్ని పెట్టుబడులు అమల్లోకి వచ్చాయో ఎప్పటికప్పుడు పరిశీలించి అందుకు తగ్గట్టు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.




**మంత్రులు గేరు మార్చాలి...** శాఖల పరంగా మంత్రుల పనితీరు మెరుగుపడాలని సీఎం అన్నారు. అందరూ గేరు మార్చాలని సూచించారు. "మొదటి ఆరు నెలలు మంత్రుల పనితీరును అంతగా పట్టించుకోలేదు. ఇకపై ఎవరినీ ఉపేక్షించను. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శాఖల వారీగా తీసుకోవచ్చు. వాట్సప్ గవరెన్స్‌కు మంచి స్పందన వస్తోంది.

వివిధ పథకాల అమలు తీరుపై చేయిస్తోన్న సర్వేల్లో సానుకూల స్పందన వస్తోంది" అని అన్నారు.

**సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం...** ఇకపై నాణ్యమైన, పోషక విలువలు కలిగి సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై కేబినెట్‌లో చర్చ జరిగింది. మెనూలో చేసిన మార్పులపై సమావేశంలో లోకేశ్ వివరించారు. ప్రాంతాల వారీగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తీసుకొచ్చిన మార్పులను లోకేశ్ ప్రస్తావించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారాన్ని లోకేశ్ కోరారు. ఈ పథకం అమలుకు అవసరమైన నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

## జగన్‌కు అసెంబ్లీని ఎదుర్కొనే ధైర్యం లేదు

అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ కలలు కనడంలో ఇబ్బంది లేదని చెప్పారు. కలలను నిజం అనుకోవడంలోనే ఇబ్బంది ఉందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లాగా మరో 15 ఏళ్లు కలలు కంటూ జగన్ ఉంటారని విమర్శించారు. జగన్ ఆ మాత్రం కలలు కనకపోతే ఆయనకు, కేడర్‌కు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. మనస్సుకు సర్ది చెప్పుకోవడానికి , ఆయన కేడర్‌కు నమ్మకాన్ని నింపడానికి జగన్ ఈ ప్రయాస పడుతున్నారని అన్నారు.

జగన్ కలలు కల్లలుగానే మిగిలి పోతాయని విమర్శించారు. ప్రతిపక్ష హోదాపై గత శాసనసభలో ఏం చెప్పారో గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్‌కు అసెంబ్లీని ఎదుర్కొనే ధైర్యం లేకనే ఇలా మాట్లాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు.



**అసెంబ్లీ ప్రక్షాళన అయిపోయింది: ఎమ్మెల్సీ ఆశోక్ బాబు...** అసెంబ్లీ ప్రక్షాళన అయిపోయింది... ఇంకా కౌన్సిల్ ప్రక్షాళన మాత్రమే మిగిలి ఉందని ఎమ్మెల్సీ ఆశోక్ బాబు తెలిపారు. ఈ నెల 7న నిర్వహించనున్న నామినేషన్ ర్యాలీలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ వేదికగా చంద్రబాబును అవమానించిన తీరు, అసెంబ్లీలో జరిగిన విధానాన్ని ప్రజలు గమనించారని అన్నారు. ఇది కౌరవ సభ రాను.. గౌరవ సభ అయితేనే వస్తానని చంద్రబాబు చెప్పడం.. ఆయనను నమ్మి ప్రజలు 164 సీట్లతో అత్యధిక మెజార్టీతో గెలిపించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ముద్దాయిలను, నిందితులను, రౌడీ షీటర్లను, మహిళలను అపహస్యం చేసిన వారిని ఎమ్మెల్సీగా నియమించిందని విమర్శించారు. వాళ్లు వినేది లేదు.. చెప్పేది లేదు.. ఎవరైనా మాట్లాడితే మొత్తం అందరూ నిలబడి ఇబ్బందులకు గురి చేయడం తప్ప.. వారు చేసేది ఏమి లేదని చెప్పారు. అసెంబ్లీ ఏ రకంగా ప్రక్షాళన అయిందో.. కౌన్సిల్ కూడా అ రకంగా ప్రక్షాళన జరిగితేనే ప్రభుత్వం సజావుగా సాగుతుందని ఎమ్మెల్సీ అశోక్ బాబు పేర్కొన్నారు.

## లిక్కర్ స్కామ్‌పై సిట్ పడింది.. తాడేపల్లి ప్యాలెస్ బయట తగలబడింది: తెదేపా పోస్ట్



అమరావతి: తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ నివాసం వద్ద బుధవారం రాత్రి కొన్ని వస్తువులు, కాగితాలు తగలబెట్టడం చర్చనీయాంశమైంది. మద్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటు ప్రకటన వచ్చాక ఈ ఘటన చోటుచేసుకోవడంపై తెదేపా శ్రేణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే కొన్ని వస్తువులను తగులబెట్టేందుకు ఇంటి గేటు బయట నిప్పు పెట్టారని ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు లోతైన విచారణ జరపాలని కోరుతున్నారు.

మరోవైపు ఈ ఘటనపై అధికారిక సోషల్ మీడియా ఖాతాలో తెదేపా పోస్ట్ చేసింది. "ఉదయం లిక్కర్ స్కామ్‌పై సిట్ పడింది.. రాత్రికి తాడేపల్లి ప్యాలెస్ బయట తగలబడింది. ప్యాలెస్ బయట తగలబడిన కాగితాలు, డైరీలు ఏంటి? సిట్ ఇంటి దాకా వస్తుందని.. ముందే లిక్కర్ స్కామ్‌కి సంబంధించి తాను రాసుకున్న లెక్కలు, డాక్యుమెంట్లు తగలబెట్టారా? ఇప్పటి వరకు ఇంటి ముందు ఉన్న సీసీ ఫుటేజ్ ఎందుకు బయట పెట్టలేదు?తానే తగలబెట్టి ప్రభుత్వం మీద తోసేయటమే 2.0నా?ఎన్ని కుట్రలు చేసినా వదిలేది లేదు. సిట్ వస్తుంది.. విచారణ చేస్తుంది.. అవినీతిని బయటకు తీస్తుంది.. గెట్ రెడీ.. స్టే ట్యూన్డ్ టు తాడేపల్లి ఫైల్స్" అని పేర్కొంది.

## ఏపీ మంత్రులకు ర్యాంకులు.. మొదటి స్థానంలో ఫరూఖ్, చివరి స్థానంలో సుభాష్

అమరావతి: డిసెంబరు వరకు దస్త్రాల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్టు సీఎం చెప్పారు. దస్త్రాలు వేగంగా క్లియర్ చేయాలని మంత్రులకు సూచించారు.

**మంత్రులకు సీఎం చంద్రబాబు కేటాయించిన ర్యాంకులివే..** 1. ఎన్ఎండీ ఫరూఖ్ 2. కందుల దుర్గేశ్ 3. కొండపల్లి శ్రీనివాస్ 4. నాదెండ్ల మనోహర్ 5. డోలా బాలవీరాంజనేయస్వామి 6. సీఎం చంద్రబాబు 7. సత్యకుమార్ 8. నారా లోకేశ్
9. బీసీ జనార్ధన్‌రెడ్డి 10. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 11. సవిత 12. కొల్లు రవీంద్ర 13. గొట్టిపాటి రవికుమార్ 14. నారాయణ 15. టీజీ భరత్ 16. ఆనం రామనారాయణరెడ్డి 17. అచ్చెన్నాయుడు 18. రాంప్రసాద్‌రెడ్డి 19. గుమ్మడి సంధ్యారాణి 20. వంగలపూడి అనిత 21. అనగాని సత్యప్రసాద్ 22. నిమ్మల రామానాయుడు 23. కొలుసు పార్థసారథి 24. పయ్యావుల కేశవ్ 25. వాసంశెట్టి సుభాష్.




## చేసిన మంచి పనులే మనతో ఉంటాయి: నారా భువనేశ్వరి

విజయవాడ: విజయవాడలో నిర్వహించే మ్యూజికల్ నైట్‌కు ముఖ్యమంత్రి అయినా, ఆయన వెంట వచ్చే పీఏలు, భద్రతా సిబ్బంది.. ఎవరైనా టికెట్ కొనుగోలు చేస్తేనే లోనికి అనుమతి అని ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న యుఫోరియా కార్యక్రమ వివరాలను ఆమె వెల్లడించారు. తమ కుటుంబ సభ్యులకు రూ.6 లక్షలు వెచ్చించి చంద్రబాబే మ్యూజికల్ నైట్ టికెట్లు కొని టేబుల్ బుక్ చేశారని తెలిపారు. ఎవరి కాళ్లమీద వాళ్లే నిలబడాలి అని భావించే వ్యక్తి చంద్రబాబు అని పేర్కొన్నారు. అందుకే ట్రస్టు కార్యక్రమాల గురించి ఆయన్ను తానేమీ అడగనని, అడిగినా వెంటనే అంగీకరించరని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా మ్యూజికల్ నైట్ ఈవెంట్‌కు ఆహ్వానించామన్న భువనేశ్వరి.. ఆయన తప్పకుండా వస్తారని ఆకాంక్షించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అని ఎన్టీఆర్ నమ్మారని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని.. అది చాలా మంది జీవితాలను నిలబెడుతుందన్నారు. "రక్తదానం చేసిన వ్యక్తులు ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపుతారు. ఫండ్ రైజింగ్ కోసం మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దీన్ని నిర్వహించేందుకు తమన్ ముందుకొచ్చారు. అందరూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలి. మనం చేసిన మంచి పనులే మనతో ఉంటాయి" అని నారా భువనేశ్వరి తెలిపారు.




మరో 30 ఏళ్ల పాటు తానే అధికారంలోకి ఉంటానని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారని జమ్మలమడుగు భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన 30 ఏళ్లు ఉంటే.. తాము కూడా 30 తరాలు అధికారంలో ఉంటామని వ్యాఖ్యానించారు. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం మంచిది కాదని జగన్‌కు ఆదినారాయణరెడ్డి హితవు పలికారు. కేంద్రం, రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం అధికారంలో ఉన్న కారణంగా.. వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నామని వ్యాఖ్యానించారు. కడపలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## జగన్‌కు విశ్వాసనీయత లేదు : మాజీ మంత్రి ఆలపాటి

అమరావతి: ఓడిపోయాక కూడా వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఆలోచన తీరులో ఏమాత్రం మార్పు రాలేదని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ఈ నెల 27న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. శుక్రవారం తాను నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో కూటమి నాయకత్వం, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. ఇప్పటికే 3,46,000 పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారని ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే కూటమికి మద్దతు తెలియజేయాలని అన్నారు. గత పాలనలో ఎంత నష్టం, కష్టం జరిగిందో అందరికి తెలుసు.. ప్రజలు సైతం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. రాజకీయాల్లో ఎలాంటి విలువలు లేని ఏకైక వ్యక్తి జగన్ రెడ్డి మాత్రమేనని విమర్శించారు..

దాదాపు 16 నెలలు జైల్లో ఉండి బెయిల్‌పై బయట తిరుగుతున్నా ముద్దాయి జగన్ రెడ్డి మాత్రమేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. జగన్ వ్యవస్థలను అన్నిటిని నిర్వీర్యం చేసి విధ్వంసక పాలన సాగించారని మండిపడ్డారు. జగన్ రెడ్డి తన స్థితి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద ఉంచిన ఘనత నీదే కాదా జగన్ రెడ్డి అని నిలదీశారు. జగన్ విధానాల వల్ల రాష్ట్రం 25 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన తర్వాత నష్టపోయిన రాష్ట్రానికి గత చంద్రబాబు ప్రభుత్వం రాజధానిగా అమరావతిని చేసి, పోలవరం నిర్మాణానికి నిరంతరం కృషి చేసి.. పెట్టుబడులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి దిగిపోయే నాటికి ఏ ఒక్కటైనా అభివృద్ధి పని జరిగిందా అని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు.

## కీర్తి సురేష్.. చీరలో కూడా హై గ్లామర్ డోస్

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గత ఏడాది 'బేబీ జాన్' మూవీతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. బిగ్గెస్ట్ డిజాస్టర్ గా మారింది. కానీ ఈ సినిమాలో కీర్తి సురేష్ కాస్తా గ్లామర్ డోస్ పెంచి నటించింది. సాంగ్స్ లో కూడా అల్ట్రా మోడ్రన్ లుక్స్ లో మెస్మరైజ్ చేసింది. దీంతో బాలీవుడ్ మీడియా కీర్తి సురేష్ ని బాగా వైరల్ చేసింది. సౌత్ లో స్టార్ హీరోలతో జతకట్టిన కీర్తి సురేష్ ఎప్పుడు కూడా గ్లామర్ షో పరంగా లిమిటేషన్స్ లోనే ఉంది. అయితే బాలీవుడ్ లో సక్సెస్ కావాలంటే లుక్స్ మార్చాల్సిందే అని ఫిక్స్ అయినట్లు ఉంది. దీంతో మునుపెన్నడూ లేని సరికొత్త అందంతో కీర్తి సురేష్ ప్రస్తుతం సందడి చేస్తోంది. పెళ్లి తర్వాత ఎక్కువగా ఈ బ్యూటీ చీరలలోనే కనిపిస్తున్న కూడా వాటికి మోడ్రన్ టచ్ చేస్తోంది. స్టన్నింగ్ లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఈ బ్యూటీ హిందీలో 'అక్క' అనే వెబ్



సిరీస్ లో నటించింది. రాధికా ఆప్టే తో పాటు ఈ సిరీస్ లో కీర్తి సురేష్ నటించింది. తాజాగా ఈ వెబ్ సిరీస్ టీజర్ లో రిలీజ్ అయ్యింది. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్ లో కీర్తి సురేష్ పాల్గొంది. వైట్ కలర్ శారీలో, కర్లీ హెయిర్ తో ఉన్న మోడ్రన్ మహారాణిలా ఈ కీర్తి సురేష్ ఈ ఈవెంట్ లో కనిపించింది. 'అక్క' టీజర్ లో ఆమె క్యారెక్టర్ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉన్నట్లు కనిపిస్తోంది. కాస్తా గ్రే షేడ్స్ లో సీరియస్ మూడ్ లో కీర్తి సురేష్ టీజర్ లో కనిపించింది. ఫీమేల్ సెంట్రిక్ గా ఈ వెబ్ సిరీస్ ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నెట్ ఫ్లిక్స్ లో ఈ సిరీస్ రిలీజ్ కానుంది. ఇక 'అక్క' టీజర్ రిలీజ్ సందర్భంగా కీర్తి సురేష్ తీసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలలో కీర్తి సురేష్ చాలా అందంగా ఉందనే మాట వినిపిస్తోంది. పెళ్లి తర్వాత ఆమె స్టైల్, లుక్స్, బాడీ లాంగ్వేజ్ లో పూర్తిగా మార్పు వచ్చిందని ఈ లుక్స్ చూసిన నెటిజన్లు అంటున్నారు. చాలా కాన్ఫిడెంట్ గా క్వీన్ లా రాజసం ఉట్టిపడే విధంగా కీర్తి లుక్స్ ఉన్నాయని కామెంట్స్ చేస్తున్నారు. ఇదే లుక్స్ మెయింటేన్ చేస్తే కచ్చితంగా బాలీవుడ్ లో ఆమె స్పీడ్ పెరగడం ఖాయం అని అందరు అనుకుంటున్నారు.

## రాధే శ్యామ్ సినిమా వల్లే ఆ అవకాశమొచ్చింది

నాలుగేళ్ల ముందు వరకు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డ గత రెండేళ్లుగా వరుస ఫ్లాపులతో సతమతమవుతుంది. బాలీవుడ్ లో సెటిల్ అవుదామనుకుని తెలుగులో వచ్చిన ఆఫర్లను కొన్ని కాదనుకోవడం, తర్వాత తను నటించిన సినిమాలు ఫ్లాప్ అవడంతో అమ్మడికి తెలుగులో అవకాశాలు రావడం తగ్గిపోయాయి. రీసెంట్ గా బాలీవుడ్ సినిమా దేవాతో ప్రేక్షకుల్ని పలకరించిన పూజా ఆ సినిమాతో మరో ఫ్లాపును మూటగట్టుకుంది. ఇదిలా ఉంటే అమ్మడు తమిళంలో స్టార్ హీరో సూర్య సరసన రెట్రో సినిమాలో ఛాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తి చేసుకుంది. సౌత్ లో అవకాశాలు లేని టైమ్ లో వచ్చిన రెట్రో ఛాన్స్



ను గట్టిగా వాడుకోవాలని పూజా ఈ సినిమా కోసం చాలా కష్టపడుతుంది. ఓ రకంగా చెప్పాలంటే ఇలాంటి టైమ్ లో పూజా సూర్య సరసన అవకాశం అందుకోవడమంటే అదృష్టమనే చెప్పాలి. అయితే ఈ అదృష్టం తనకెలా దక్కిందో పూజా రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. రెట్రోలో తనకు ఛాన్స్ రావడం గురించి మాట్లాడుతూ ఈ అవకాశం రావడానికి కారణం రాధే శ్యామ్ సినిమా అని చెప్పింది పూజా. రాధే శ్యామ్ సినిమాలో తన ఎమోషనల్ సీన్స్ చూసి డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ ఈ సినిమా కోసం తనను ఎంపిక చేశారని తెలిపింది. రెట్రోలో తన పాత్ర చాలా భిన్నంగా ఉంటుందని, ఇందులో కూడా చాలా ఎమోషనల్ సీన్స్ ఉన్నాయని పూజా ఈ సందర్భంగా వెల్లడించింది. దీంతో పాటూ విజయ్ తో కలిసి చేస్తున్న సినిమా గురించి కూడా పూజా మాట్లాడింది. జన నాయకుడు సినిమాలో తాను కూడా భాగమవడం ఎంతో సంతోషంగా ఉందని, విజయ్ ఆఖరి సినిమా అనగానే ఏమీ ఆలోచించకుండా వెంటనే ఈ సినిమా ఒప్పుకున్నట్టు పూజా వెల్లడించింది. అయితే గతంలో వీరిద్దరూ కలిసి బీస్ట్ అనే సినిమాలో నటించిన విషయం తెలిసిందే. బీస్ట్ కూడా ఫ్లాప్ గానే నిలిచింది. ఇప్పుడు కోలీవుడ్ లో చేస్తున్న ఈ రెండు సినిమాలతో అయినా పూజా హిట్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి.




## నయన్, సిద్ధార్థ్ 'టెస్ట్' మూవీ.. టీజర్ ఎలా ఉందంటే?



స్టార్ హీరోయిన్ నయనతార, ప్రముఖ నటుడు మాధవన్, సిద్ధార్థ్ కలిసి నటించిన మూవీ టెస్ట్. మీరా జాస్మిన్ కీలకపాత్రలో కనిపించనుంది. సుమారు పదేళ్ల తర్వాత తమిళ ఇండస్ట్రీలోకి ఆమె రీఎంట్రీ ఇచ్చిందనే చెప్పాలి. అయితే స్పోర్ట్స్ డ్రామాగా కొత్త డైరెక్టర్ శశి కాంత్.. టెస్ట్ సినిమాను గ్రాండ్ గా తెరకెక్కించారు. వైనాట్ స్టూడియోస్ బ్యానర్ పై చక్రవర్తి రామచంద్, శశికాంత్ నిర్మించారు. అయితే టెస్ట్ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యి ఏడాదిపైగా పూర్తైనట్లు తెలుస్తోంది. 2023 ఏప్రిల్ లో చిత్రీకరణ మొదలవ్వగా.. 2024 జనవరిలో కంప్లీట్ అయినట్లు అప్పట్లో టాక్ వినిపించింది. అయితే షూటింగ్ కంప్లీట్ అయ్యి ఏడాది అవుతున్నా ఇంకా రిలీజ్ కాలేదు. ఎలాంటి అప్డేట్స్ కూడా రాలేదు. అదే సమయంలో సినిమా థియేటర్స్ లో కాకుండా ఓటీటీలో నేరుగా స్ట్రీమింగ్ కు రానుందని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. రీసెంట్ గా లీడ్ రోల్స్ మాధవన్, నయనతార, సిద్ధార్థ్.. నెట్? ఫ్లిక్స్ లో నెక్స్ట్ ఏం రానుందో.. ఫిబ్రవరి 3న చూడండంటూ పోస్ట్ పెట్టారు. దీంతో అందరికీ క్లారిటీ వచ్చేసింది. అనుకున్నట్లే నిన్న నెట్ ఫ్లిక్స్.. టెస్ట్ మూవీ తమ ఓటీటీలోకి రానుందని అధికారికంగా ప్రకటించింది. దాంతోపాటు చిన్న గ్లింప్స్ ను పోస్ట్ చేసింది. తాజాగా మేకర్స్ ఓ స్పెషల్ టీజర్ ను విడుదల చేసి అందరినీ సర్ ప్రైజ్ చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో టెస్ట్ టీజర్ ఫుల్ వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుంటోంది. అయితే టీజర్ లో సిద్ధార్థ్ ఓ క్రికెట్ ప్లేయర్ గా కనిపించారు. "జీవితం ఒక ఆటలాంటిది! ఇందులో రూల్స్ ఉండటమే దానికి అందం' అంటూ నాలుగు రూల్స్ గురించి సిద్ధార్థ్ చెప్తున్న సమయంలో నయన్ తార, మాధవన్ ను పరిచయం చేస్తారు. అదే సమయంలో ఒక పిల్లవాడితో మీరా జాస్మిన్ ను చూపించారు. ఆ తర్వాత వాళ్ల జీవితాల గురించి క్లుప్తంగా చూపిస్తారు. చివర్లో వికెట్స్ పై బైల్స్ ను కింద పడేయడంతో ఇంట్రెస్టింగ్ గా ముగిసింది. అయితే టీజర్ లో విజువల్స్ చాలా క్లియర్ అండ్ డీసెంట్ గా ఉన్నాయి. ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తున్నాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది. ఓవరాల్ గా టీజర్ ను మేకర్స్ సరైన రీతిలో కట్ చేశారని చెప్పాలి. సినిమాపై అంచనాలు పెరిగేలా రూపొందించారు. మరి టెస్ట్ మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందో ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## మెగా వంగా సెట్టయితే..?



సందీప్ రెడ్డి వంగా అంటేనే విభిన్నమైన కథలు, అత్యంత బోల్డ్ కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు. అయితే, ఈ యువ దర్శకుడికి మెగాస్టార్ చిరంజీవిపై ఉన్న అభిమానం అంతా ఇంతా కాదు. చిరు సినిమాల నుంచి ఆయన చాలా ఇన్‌స్పిరేషన్ తీసుకున్నారని, ముఖ్యంగా 'మాస్టర్' సినిమాలో చిరు సిగరెట్ కాల్చే సీన్ తనను ఎంతో ప్రభావితం చేసిందని గతంలో చెప్పిన సందీప్, ఇటీవల మెగాస్టార్ ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసి మరోసారి తన అభిమానం చాటుకున్నాడు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, 'సందీప్ – చిరు కాంబో' గురించి సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి డిఫరెంట్ చిత్రాలతో బాలీవుడ్ లోనూ తనదైన ముద్ర వేశాడు సందీప్. ఇక ప్రస్తుతం ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, మెగాస్టార్ చిరంజీవితో కూడా ఆయన ఓ సినిమా చేసే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. చిరు, సందీప్ మధ్య ఇటీవల ఓ మీటింగ్ కూడా జరిగిందని సమాచారం. ఇద్దరి వర్కింగ్ స్టైల్ పూర్తిగా విభిన్నమైనా, ఆ కాంబినేషన్ జరిగితే అభిమానులకు అసలైన మాస్ ట్రీట్ అవుతుందనే అంచనాలు పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' సినిమాలో చిరంజీవి కోసం సందీప్ ఓ పవర్‌ఫుల్ క్యారెక్టర్ డిజైన్ చేయబోతున్నాడట. దీనికి గాను, చిరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయట. 'యానిమల్'లో అనిల్ కపూర్ క్యారెక్టర్‌ను ఎంత బలంగా డిజైన్ చేసారో, అలాగే చిరంజీవికి ప్రత్యేకమైన పాత్రను అందించేందుకు సిద్ధమయ్యాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. మెగాస్టార్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని, పూర్తి స్థాయిలో రక్తి కట్టించే రోల్‌ను సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నాడట. ఇటీవల, యంగ్ హీరోలు హీరో అనే ఫార్మాట్ కు కట్టుబడి ఉండకుండా, విభిన్న కథలలో సపోర్ట్ రోల్ లేదా ఇంపార్టెంట్ రోల్స్ చేసేందుకు ఓపెన్ అవుతున్నారు. చిరంజీవి కూడా అదే ధోరణిలో ముందుకు వెళ్తే, సందీప్–చిరు కాంబో ఖచ్చితంగా ఫిక్స్ అయ్యే అవకాశం ఉంది. మరి, చిరు తన అభిమాన దర్శకుడితో కలిసి పని చేసేందుకు సిద్ధమవుతారా? సందీప్ స్టైల్‌లో చిరంజీవి ఎలా మెరవబోతున్నారు? అనే విషయాలు ఆసక్తిగా మారాయి. ప్రస్తుతం స్పిరిట్ సినిమా పనుల్లో బిజీగా ఉన్న సందీప్, త్వరలోనే మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేసే అవకాశాలున్నాయి. ఇదే చిరుతో అయితే, టాలీవుడ్‌లో ఇది హాట్ టాపిక్‌గా మారడం ఖాయం. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్టయితే, మెగాస్టార్ కెరీర్‌లో మరో డిఫరెంట్ మూవీ వచ్చిందనే చెప్పాలి. ఇక 'స్పిరిట్' లో చిరు ప్రత్యేకమైన పాత్ర చేయబోతున్నారనే టాక్ ఎంత వరకు నిజమో తెలియదు గానీ, మెగాస్టార్ – సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్ గనక రియాలిటీ అయ్యిందంటే మాత్రం, మెగా ఫ్యాన్స్‌కి అది పండగే. ఒకవైపు ప్రభాస్, మరోవైపు చిరు.. మధ్యలో సందీప్ రెడ్డి వంగా.. ఇక అభిమానులకు రెండు కళ్లూ సరిపోవు.

## స్టార్ హీరో సినిమాలో శ్రియ స్పెషల్ సాంగ్

స్టార్ హీరోల సినిమాల్లో భారీ సినిమాల్లో ఈ మధ్య స్పెషల్ సాంగ్స్ ఎక్కువైపోయాయి. స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ ఉందంటే ఆ సాంగ్ ఎవరు చేస్తున్నారా? ఆ పాట ఎలా ఉండబోతుందనే ఆసక్తి ముందునుంచే అందరిలో ఉంటుంది. స్టార్ హీరోల సినిమాలన్నీ పాన్ ఇండియా లెవెల్లో రిలీజవుతున్న నేపథ్యంలో అగ్ర హీరోయిన్లు సైతం ఈ స్పెషల్ సాంగ్స్ చేయడానికి వెనుకడుగేయట్లేదు. అలాంటి స్పెషల్ ఆఫర్లు వచ్చినప్పుడు చేయడం వల్ల భారీ రెమ్యూనరేషన్ తో పాటూ, నేషనల్ లెవెల్లో తమకు క్రేజ్ పెరగడం ఖాయం. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో చేస్తున్న రెట్రో సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉన్నట్టు తెలుస్తోంది. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటున్న ఈ



యాక్షన్ ఎంటర్టైనర్ కు సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ సినిమాలో ఆ స్పెషల్ సాంగ్ ను శ్రియా శరణ్ చేస్తున్నట్టు సమాచారం. రెట్రో స్పెషల్ సాంగ్‌లో సూర్యతో కలిసి శ్రియ కాలు కదిపినట్టు తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌ను వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు సమాచారం. టాలీవుడ్ లో తన సినీ కెరీర్ ను మొదలుపెట్టిన శ్రియ ఆ తర్వాత తమిళ సినిమాల్లో కూడా నటించి కోలీవుడ్ లో కూడా స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగింది. స్టార్ హీరోల సరసన నటించి అందరి మనసులు గెలుచుకున్న శ్రియ విదేశీ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకుని కొంత కాలం పాటూ సినిమాలకు దూరమైంది. తర్వాత మళ్లీ ఆర్ఆర్ఆర్ లో కనిపించిన శ్రియ తమిళ సినిమాలో కనిపించి చాలా కాలమే అవుతోంది. ఏడేళ్ల తర్వాత మళ్లీ తమిళ సినిమాలో చేయడం ఎంతో సంతోషంగా ఉందని శ్రియ ఈ సందర్భంగా తెలిపింది. రెట్రో సినిమా సమ్మర్ స్పెషల్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. కంగువ సినిమా డిజాస్టర్ అవడంతో సూర్య తన ఆశలన్నీ రెట్రో సినిమాపైనే పెట్టుకున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుతం సూర్య, ఆర్జె బాలాజీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే.

## బేబమ్మ అప్పుడే అలా అవసరమా?

ఉప్పెన సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాలు చేసిన ఈ అమ్మడు అంతే స్పీడ్‌గా కనిపించకుండా పోయింది. టాలీవుడ్‌లో ఈమెకు ఒక్క ఆఫర్ లేదు. కోలీవుడ్‌లో మాత్రం రెండు మూడు సినిమాలు చేస్తోంది. మలయాళంలో ఈ అమ్మడు సినిమాలు చేసింది. ఒకటి రెండు అక్కడ చర్చల దశలో ఉన్నాయి. ప్రస్తుతానికి తెలుగులో ఆఫర్లు రాకున్నా తమిళ్, మలయాళంలో ఆఫర్లు ఉన్నాయి. అయినా ఈ అమ్మడు తీసుకున్న నిర్ణయం షాకింగ్‌గా ఉంది. బాలీవుడ్‌లో ఈ అమ్మడు అడుగు పెట్టేందుకు రెడీ అయ్యింది. అది కూడా ఐటెం సాంగ్ తో కావడం ఆశ్చర్యకరమైన విషయం. కృతి శెట్టి ప్రస్తుతం చేస్తున్న తమిళ్ సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉండగానే బాలీవుడ్ నుంచి వచ్చిన ఐటెం సాంగ్ ఆఫర్‌కి ఓకే చెప్పింది. త్వరలోనే ఆ హిందీ సినిమా ఐటెం సాంగ్‌లో నటించబోతుంది. కృతి శెట్టి వంటి క్యూట్ ఇమేజ్ ఉన్న ముద్దుగుమ్మలు ఐటెం సాంగ్స్ చేయడం ద్వారా వచ్చే పాపులారిటీ, క్రేజ్ కంటే డ్యామేజీ ఎక్కువ అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తూ ఉంటారు. ఐటెం సాంగ్స్ చేయాలంటే మాస్ బాడీలాంగ్వేజ్ ఉండాల్సిన



అవసరం ఉంది. అందుకే కృతి శెట్టి ఐటెం సాంగ్ చేస్తే ఎంత వరకు వర్కౌట్ అవుతుంది అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలుగులో కృతి శెట్టిని ఐటెం సాంగ్‌లో చూడాలని ఎవరూ అనుకోరు. ఎందుకంటే ఆమెకు ఉప్పెన సినిమాతో తెలుగులో బేబమ్మ అనే క్యూట్ అమ్మాయి ఇమేజ్ దక్కింది. కనుక ఐటెం సాంగ్ చేయడం వల్ల ఆమెకు నెగిటివిటీ ఎక్కువ వస్తుంది. కానీ బాలీవుడ్‌లో కృతి శెట్టి పెద్దగా ఎవరికీ తెలియదు. కనుక అక్కడ సినిమాలో ఐటెం సాంగ్ చేస్తే ఏమైనా ఫలితం ఉంటుందేమో అని ఆమె భావిస్తుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్‌గా షేర్ చేసే ఫోటోలు సైతం క్యూట్ అండ్ క్లీన్‌గా అనిపిస్తూ ఉంటాయి. ఎక్కడా ఐటెం సాంగ్ హీరోయిన్ తాలూకు అతి కనిపించదు అనేది కొందరి అభిప్రాయం. బాలీవుడ్‌లో ఈ అమ్మడు చేయబోతున్న ఐటెం సాంగ్ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. ఒక్క టర్నింగ్ పాయింట్ కోసం కృతి శెట్టి చాలా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ముందు ముందు ఈ అమ్మడి నుంచి వచ్చే సినిమాలు, ప్రత్యేక పాటలతో మరింత పాపులారిటీ సొంతం చేసుకుని తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయా అనేది చూడాలి. తెలుగులో బేబమ్మ పాత్రలో నటించి మెప్పించడం ద్వారా అదే జోనర్‌లో ఆమెను ప్రేక్షకులు చూడాలని కోరుకుంటున్నారు. అందుకే కృతి శెట్టి ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్త తెలిసిన వెంటనే ఎక్కువ శాతం మంది అలా అవసరమా అంటూ ఆమెను ప్రశ్నిస్తున్నారు.



## సర్పంచ్ ల ఎన్నికలపై ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక దిశానిర్దేశం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లోని ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన సీఎల్పీ సమావేశంలో పార్టీ బలోపేతం, ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ ఎమ్మెల్యేలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యధిక గ్రామాలు ఏకగ్రీవం చేసే బాధ్యత ఎమ్మెల్యేలదేన స్పష్టం చేశారు. గ్రామాల్లో హామీల అమలుకు ముందడుగు వేయాలని, సీసీరోడ్లు, ఆలయాలు, నిర్మాణ అనుమతులకు, నిధుల మంజూరు కోసం మంత్రులను కలవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల పదవులను కేటాయించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీలో కొత్త, పాత నేతలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా యూజీసీ కొత్త నిబంధనలు: కేటీఆర్

ఢిల్లీ: యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. "నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. మరోవైపు ఎన్‌హెచ్-365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరాం" అని కేటీఆర్ తెలిపారు




హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. "స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించాం. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నాం. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం.

రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే దిల్లీ వెళ్తున్నాం. ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదు" అని అన్నారు.

## ఏఐసీసీ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ లేఖ .. ఎందుకంటే...

హైదరాబాద్: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలకు సోనియా, రాహుల్ గాంధీలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ మంత్రి కొండా సురేఖ గురువారం లేఖ రాశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీ కులగణనను కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా శ్రమించారని వెల్లడించారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీలకు మరింత న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న మేరకు ఈ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పునరుద్ఘాటించారు. ఈ మొత్తం బీసీ సర్వే ప్రక్రియలో



పార్టీ, ప్రభుత్వపరంగా కాంగ్రెస్ అధినాయకత్వం చాలా సహకరించిందని అన్నారు.. అందుకు కృషి చేసిన ఏఐసీసీ అగ్రనేతలకు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు జాతీయ నాయకత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు.




## హయత్‌నగర్‌లో విషాదం.. స్కూల్ వ్యాన్ కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

హయత్‌నగర్: రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం స్కూల్ వ్యాన్ కింద పడి నాలుగేళ్ల చిన్నారి (ఎల్‌కేజీ విద్యార్థిని) ప్రాణాలు కోల్పోయింది. బాలిక స్కూల్ వ్యాన్ దిగి వెళ్తుండగా డ్రైవర్ రివర్స్ చేశాడు. బాలిక రోడ్డు దాటుతున్న విషయాన్ని గమనించకుండా వ్యాన్‌ను రివర్స్ చేయడంతో వెనక టైర్ల కింద పడి చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






హైదరాబాద్, వెలుగు: రైతుభరోసా విషయంలో రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్?ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రైతులందరికీ రూ.7,500 రైతుభరోసా అని చెప్పి.. దాన్ని రూ.6 వేలకు కుదించారని గుర్తుచేశారు. ఇప్పుడు అది కూడా కేవలం ఎకరంలోపున్న రైతులకే అమలు చేశారని తెలిపారు. కానీ, రైతుభరోసాను ఇచ్చి మాట మీద నిలబడినట్టు ప్రచా రం చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 68 లక్షల మంది రైతులుంటే.. కేవలం 21,45,330 మందికే రైతు భరోసా వేశారని వెల్లడించారు. మరి మిగతా 47 లక్షల మంది రైతుల పరిస్థితి ఏంటని బుధవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారుల్లో కోతలు విధించడంపై ఉన్న దృష్టి రైతులు, పేదల సంక్షేమం పట్ల ఏమాత్రం లేదని హరీశ్ రావు విమర్శించారు.

14 నెలల పాలనలో 415కిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరమని హరీశ్? రావు అన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో పీఈ సెట్, ఎడ్ సెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. మార్చి 12న పీఈ సెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మార్చి 15 నుంచి మే 24 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించినట్లు ఉన్నత విద్యా మండలి తెలిపింది. జూన్ 11 నుంచి 14 వరకు తెలంగాణ పీఈ సెట్ పరీక్షలు జరగనున్నాయి.

**ఎడ్‌సెట్ షెడ్యూల్ ఇదే..** తెలంగాణ ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను కాకతీయ వర్సిటీ విడుదల చేసింది. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 12 నుంచి మే 13 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వర్సిటీ ప్రకటనలో పేర్కొంది. జూన్ 1న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి.




## సాగులో సాంకేతికత.. పంటల పరిశీలనలో ఇక్రిశాట్ డ్రోన్‌ల వినియోగం!

**వ్యవసాయంలో సరికొత్త విధానాలకు ఇక్రిశాట్ బీజం వేస్తోంది. ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో ఉపయోగించే డ్రోన్‌లకు భిన్నంగా అడ్వాన్స్ టెక్నాలజీ డ్రోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా పంట ఎదుగుదల, వాటికి వ్యాపించిన తెగుళ్లు, ఎంత మేరకు దిగుబడి వస్తోంది.. అనే అంశాలను క్షణాల వ్యవధిలో సమాచారం తెలుస్తోంది.**

## ఎల్బీనగర్ ఘటనపై జీహెచ్ఎంసీ సీరియస్.. అనుమతులు రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 6: నగరంలోని ఎల్బీనగర్ సెల్లార్ కుంగిన ఘటనపై జీహెచ్ఎంసీ సీరియస్ అయ్యింది. భవన నిర్మాణ అనుమతులను బల్దియా రద్దు చేసింది. సెట్ బ్యాక్ లేకుండా అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నారని.. బారికేడింగ్, రిటర్నింగ్ వాల్ లేకుండానే సెల్లార్ తవ్వకం జరిగిందని తేలింది.

అసలు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు జరిపారని.. ముగ్గురు మృతికి కారణ మయ్యారంటూ బిల్డర్‌పై క్రిమినల్ కేసు పెట్టింది జీహెచ్ఎంసీ. జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జీహెచ్ఎంసీ ఈ కేసు పెట్టింది. అలాగే బిల్డర్‌కు జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

**ఓనర్‌పై కేసు...** ఎల్బీనగర్‌లోని సెల్లార్ లోపల పనిచేస్తుండగా పైనుంచి మట్టిదిబ్బలు కూలి ముగ్గురు కూలీలు మృతి చెందిన ఘటనలో ఓనర్ కుస్మా రమేష్‌పై 106(1) 125 బీఎన్ఎస్ సెక్షల కింద ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతులు రాము, వీరయ్య, వాసు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా.. గాయపడిన బిక్షపతి ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం శరీరంలో అక్కడక్కడ కొన్ని గాయలతో నిలకడగానే బిక్షపతి ఆరోగ్యం ఉన్నట్లు తెలుస్తోంది. పేదవారు కావడంతో కనీసం హాస్పిటల్ బిల్లు కూడా కట్టలేని పరిస్థితిలో బిక్షపతి కుటుంబం ఉంది.

## ఉప ఎన్నికలపై కేటీఆర్ షాకింగ్ కామెంట్స్

ఢిల్లీ: ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది, వారిపై అనర్హత వేటుపడాలని చెప్పారు. అదే అంశంపై న్యాయం నిపుణులతో చర్చిస్తామని అన్నారు. సాయంత్రం ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరుతానని తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశామని చెప్పారు. యూజీసీ నిబంధనలు మార్చడంపై తమ అభ్యంతరాలు తెలియజేస్తూ ఒక విజ్ఞప్తి అందజేశామని కేటీఆర్ తెలిపారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాస్వామ్య హక్కులను హరించేలా కొన్ని నిబంధనలు ఉన్నాయని అన్నారు. గవర్నర్లకు అధికారాలు కట్టబెడుతూ రాష్ట్రాల పరిధిలోని యూనివర్సిటీల్లోని నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేకుండా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. వైస్ ఛాన్సలర్ ఎంపికలో నిపుణులు ఉండేలా పారదర్శకంగా ఉండాలని సూచించామని అన్నారు. తమ అభిప్రాయాలు యూజీసీకి సైతం చెప్పామన్నారు. మరో మంత్రి నితిన్ గడ్కరీను కూడా కలిసి సిరిసిల్లతో ముగుస్తున్న %చీఎ-365దీ%ను రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి కట్టి కోరుట్ల వరకు పొడిగించాలని కోరామని కేటీఆర్ చెప్పారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com